
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
7

విశాఖపట్నం
జిల్లా వార్తలు

సోమవారం 28 అక్టోబరు 2024



నేడు నగరానికి ఎక్సైజ్ శాఖా మంత్రి రాక



విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గనులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం నగరానికి రానున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో విశాఖ చేరుకుని, అనకాపల్లి జిల్లా పర్యటనకు వెళతారు. సాయంత్రం నోవాటెల్‌లో సీఐఐ, ఫిక్కీ ప్రతినిధులతో భేటీ అవుతారు. మంగళవారం ఆనందపురం మండలం జగన్నాధపురంలో క్వారీని సందర్శిస్తారు. అనంతరం వీఎంఆర్‌డీ చిల్డ్రన్ ఎరీనాలో గనులశాఖ అధికారులతో సమీక్షిస్తారు. ఏయూలో ప్రాంతీయ ఎక్సైజ్ లేబొరేటరీని సందర్శించి, తిరిగి చిల్డ్రన్ ఎరీనాలో ఎక్సైజ్ శాఖపై సమీక్షిస్తారు.

మందకొడిగా...

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు
- ఉత్తరాంధ్రలో ఇప్పటి వరకు 1,200 మంది మాత్రమే దరఖాస్తు
- 6వ తేదీతో ముగియనున్న గడువు
- ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా నమోదుకు వీలు

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఈ పరిధిలోని ఆరు జిల్లాల్లో స్కూలు అసిస్టెంట్, అంతకంటే ఎక్కువ హోదా కలిగిన టీచర్లు, లెక్చరర్లు, ఆచార్యులు ఓటర్లుగా తమ పేర్లు నమోదుచేసుకోవచ్చు. ఓటర్ల నమోదుకు గత నెల 30వ తేదీన నోటిఫికేషన్ జారీ అయింది. ఆ తరువాత దసరా సెలవులు రావడంతో దీనిపై దృష్టి సారించలేదు. కాగా ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా అవకాశం ఇచ్చింది.

ఉత్తరాంధ్ర పరిధిలో ఇప్పటివరకు 1,200 మంది మాత్రమే ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వ టీచర్లతోపాటు ప్రైవేటు పాఠశాలలు/కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయ, అధ్యాపకులకు ఓటు హక్కు కల్పిస్తారు. 2018లో జరిగిన ఎన్నికల్లో 21వేల మంది ఓటు వేయగా, ఈ సారి పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఓటర్ల నమోదుకు వచ్చేనెల ఆరో తేదీ వరకు గడువుంది. ఎన్నికల బరిలో దిగే అభ్యర్థుల తరఫున ఓటర్ల నమోదు చేపట్టేందుకు ఆయా ఉపాధ్యాయ సంఘాలు సన్నాహాలు చేస్తున్నాయి. దీనిపై దీపావళి తరువాత పాఠశాలలు, కళాశాలల్లో ప్రచారంచేసే అవకాశం ఉంది. ఓటర్ల నమోదుకు సంబంధించి ఒక పాఠశాల/కళాశాల నుంచి మొత్తం దరఖాస్తులు తహసీల్దార్లకు అందజేయాలి. ఉన్నత పాఠశాల/

... మిగతా 8వ పేజీలో

వసూల్ ఖాకీలు

- సీపీ హెచ్చరికలు బేఖాతరు
- అవకాశం దొరికితే డబ్బులు గుంజడమే పని
- పోలీస్‌స్టేషన్లతోపాటు, ట్రాఫిక్ విభాగంలోనూ విచ్చలవిడితనం
- డ్రంకెన్ డ్రైవ్‌లో ట్రాఫిక్ పోలీసుల చేతివాటం
- స్టేషన్‌కు వచ్చే సివిల్ కేసుల్లో వసూళ్లకు పాల్పడుతున్న సిబ్బంది
- వీధి వ్యాపారుల నుంచి రాత్రి గస్తీ సిబ్బంది దందాలు
- సమాచార సేకరణలో స్పెషల్ బ్రాంచి విఫలం
- ట్రాఫిక్ ఎస్ఐలు, హోంగార్డుల సస్పెన్షన్‌తో పోలీస్ వసూళ్లపై చర్చ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగర పోలీస్‌కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న కొంతమంది ఖాకీలు కట్టుతప్పుతున్నారు. అవకాశం దొరికితే చేతివాటం ప్రదర్శిస్తున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీపీ శంఖబ్రత బాగ్చి చేసిన హెచ్చరికలను పెడచెవిన పెట్టి మరీ వసూళ్లపర్వాన్ని కొనసాగిస్తున్నారు. తాజాగా వాహన చోదకుల నుంచి డబ్బుల వసూలు చేశారనే అభియోగంపై ఇద్దరు ట్రాఫిక్ ఎస్ఐలు, హోంగార్డులను సీపీ సస్పెండ్ చేయడం పోలీస్‌శాఖలో జరుగుతున్న అవినీతిపై తీవ్రస్థాయి చర్చకు దారితీసింది.

పోలీస్‌శాఖ ప్రతిష్ఠను దిగజార్చేలా నగరంలో కొంతమంది పోలీసులు పనిచేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏమాత్రం అవకాశం దొరికినా బాధితుల నుంచి డబ్బులు గుంజేస్తున్నారు. వీరిలో శాంతి భద్రతల విభాగంలో పనిచేసేవారే కాకుండా ట్రాఫిక్, నేరపరిశోధన విభాగంలో పనిచేస్తున్నవారు కూడా ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సీపీగా శంఖబ్రత బాగ్చి బాధ్యతలు చేపట్టిన తరువాత పోలీస్‌శాఖలో అవినీతికి తావుండదనే ప్రచారం జరిగింది. ఎవరైనా చిన్న తప్పు చేసినా, అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటారనే భయంతో నగరంలో పోస్టింగ్‌కు ప్రయత్నించిన చాలామంది సీఐలు తమ ప్రయత్నాలను విరమించుకుని రేంజ్ పరిధిలోనే ఉండిపోయారు. నగరంలో అప్పటికే వున్నవారంతా విధి నిర్వహణలో జాగ్రత్తపడ్డారు.

మళ్లీ మొదటికొచ్చిన వైఖరి

పోలీస్‌స్టేషన్లలో జరుగుతున్న వ్యవహారాలు సీపీ దృష్టికి చేరడం లేదనే భావనతో గతంలో వసూళ్లకు పాల్పడిన వారంతా రెచ్చిపోతున్నారు. అవకాశం దొరికినచోటల్లా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే సివిల్ కేసులు, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించే క్రమంలో కొంతమంది సీఐలు సిబ్బంది ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. మరికొన్ని స్టేషన్లలో అధికారులు అవినీతికి దూరంగా ఉంటున్నప్పటికీ కిందిస్థాయి

... మిగతా 8వ పేజీలో

ఉదాహరణలివి..

కొద్దిరోజుల కిందట మల్కాపురం ఎస్ఐ దేముడమ్మ ఒకకేసులో నిందితులను రిమాండ్‌కు వెళ్లకుండా తప్పిస్తానని రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో సీపీ ఆమెను సస్పెండ్ చేశారు. హార్బర్ ఏసీపీగా పనిచేసిన మోసెజ్ పాల్ ఒక కేసులో నిందితులను కేసు నుంచి తప్పిస్తానని భారీగా వసూలుచేశారు. డబ్బులు తీసుకున్నాక కేసు నుంచి తప్పించకపోవడంతో బాధితులు సీపీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టగా అభియోగాలు వాస్తవమేనని తేలడంతో ఏసీపీపై చర్యల కోసం డీజీపీకి నివేదిక పంపించారు. డీజీపీ ద్వారకాతిరుమలరావు ఏసీపీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. డబ్బులు తీసుకుని గంజాయి కేసులన్నీ ఒకే లాయర్‌కు అప్పగిస్తున్నారనే అభియోగంపై ఫోర్త్‌టౌన్ కానిస్టేబుల్ హరీష్‌ను సస్పెండ్ చేశారు. ఒక కేసులో బాధితుల నుంచి డబ్బులు తీసుకుని వారికి ఫేవర్ చేసేందుకు యత్నించిన నాయుడు అనే హెడ్‌కానిస్టేబుల్‌ను సీపీ సస్పెండ్ చేశారు. ఇవి బాధితులు ధైర్యంగా బయటకు రావడంతో బయటపడిన ఉదంతాలు మాత్రమే. గుట్టుచప్పుడు కాకుండా వసూళ్లు జరిగిపోతున్నవి ప్రతి స్టేషన్‌లోనూ భారీగానే ఉన్నాయని పోలీసులే అంగీకరిస్తున్నారు.

యూజర్ చార్జీల్లో చేతివాటం!

వసూలు చేసిన సొమ్ము సిబ్బంది జేబులోకి?

- చెత్తపై యూజర్ చార్జీలను రద్దుచేసిన కూటమి ప్రభుత్వం
- అప్పటికే వసూలు చేసిన మొత్తాన్ని జీవీఎంసీకి జమచేయని కార్యదర్శులు
- హోటళ్లు, ఆస్పత్రుల నుంచి కొనసాగుతున్న అనధికారిక వసూళ్లు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగర వాసుల నుంచి చెత్త సేకరణకు వైసీపీ ప్రభుత్వ హయాంలో వసూలు చేసిన యూజర్‌చార్జీల్లో కొంతమంది వార్డు సచివాలయం కార్యదర్శులు చేతివాటం ప్రదర్శించారు. సాధారణ ఎన్నికలకు ముందు ప్రజలు, వ్యాపారుల నుంచి వసూలుచేసిన ఈ సొమ్మును జీవీఎంసీకి జమ చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూజర్‌చార్జీలను పూర్తిగా రద్దుచేసింది. అయినప్పటికీ అనధికారికంగా దుకాణాలు, హోటళ్ల నుంచి వసూలు చేసి జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జీవీఎంసీ పరిధిలో రెసిడెన్షియల్ కేటగిరీలో 5,87,910 అసెస్‌మెంట్లు, కమర్షియల్ కేటగిరీలో 25,722 అసెస్‌మెంట్లు ఉన్నట్టు ప్రజారోగ్యవిభాగం అధికారులు గుర్తించారు. ఘన వ్యర్థాల నిర్వహణ చట్టం-2016 ప్రకారం చెత్త సేకరణ, తరలింపు శాస్త్రీయంగా నిర్వహించేందుకు ప్రజల నుంచి యూజర్‌చార్జీలను వసూలు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని స్థానిక సంస్థలకు వెసులుబాటు కల్పించింది. దీని ఆధారంగా జీవీఎంసీ అధికారులు నివాస భవనాలను నెలకు రూ.120 చొప్పున, మురికివాడల్లో రూ.60 చొప్పున, కమర్షియల్ కేటగిరీ అయితే నెలకు కనిష్ఠంగా రూ.200 నుంచి గరిష్ఠంగా రూ.15వేల వరకూ యూజర్ చార్జీలను వసూలు చేసేలా వైసీపీ ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ పాలకవర్గం తీర్మానం చేసింది. దీనివల్ల జీవీఎంసీకి ప్రతి నెలా రూ.7.77 కోట్లు సమకూరుతుందని అంచనా చేశారు. యూజర్ చార్జీల వసూలు బాధ్యతలను ఆయా వార్డు సచివాలయాల్లోని ఎన్విరాన్‌మెంట్ అండ్ శానిటేషన్ సెక్రటరీలకు అప్పగించింది. వీరంతా జీవీఎంసీ రూపొందించిన మొబైల్‌యాప్ ద్వారా చార్జీలను సేకరించి జీవీఎంసీ ఖాతాకు జమచేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో సాధారణ ఎన్నికలు జరిగే అవకాశముందనే ప్రచారంతో ప్రజల్లో వ్యతిరేకతను తగ్గించుకునేందుకు వైసీపీ ప్రభుత్వం వార్డు సచివాలయ కార్యదర్శులపై ఒత్తిడి తగ్గించింది. యూజర్ చార్జీలకు సంబంధించి అప్పటివరకూ జరిగిన వారంతపు సమీక్షలను అధికారులు పక్కనపెట్టేశారు. అయినప్పటికీ కొన్నివార్డు సచివాయాలకు కొందరు స్వచ్ఛందంగా వచ్చి డబ్బు చెల్లించేవారు.

జీవీఎంసీ పరిధిలోని 578 వార్డు సచివాలయాల పరిధిలో

... మిగతా 8వ పేజీలో



విక్టరీ ఎట్ సీపై లేజర్ షో

అబ్బురపరిచిన లేజర్‌షో

- బీచ్‌రోడ్డుకు పోటెత్తిన జనం

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):

బీచ్‌రోడ్డులో 'విక్టరీ ఎట్ సీ' స్థూపం వద్ద జీవీఎంసీ, పోలీస్, నేవీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన లేజర్‌షో అబ్బురపరిచింది. బీచ్‌రోడ్డుకు వచ్చే సందర్శకులను అలరించడంతోపాటు పర్యాటకులను ఆకర్షించేందుకు వీలుగా జీవీఎంసీ స్మార్ట్‌సిటీలో భాగంగా ప్రతి ఆదివారం లేజర్‌షో నిర్వహించాలని నిర్ణయించారు. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో విశాఖ నగరం పాత్ర గురించి సౌండ్ అండ్ లేజర్‌షో ద్వారా ప్రజలకు తెలిసేలా ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు భారీ సంఖ్యలో నగరవాసులు అక్కడికి చేరుకున్నప్పటికీ, నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా సాంకేతికలోపాలు తలెత్తడంతో లేజర్‌షోకు పలుమార్లు ఆటంకం ఏర్పడింది. దీంతో సందర్శకులు అసంతృప్తితో వెళ్లిపోయారు. వచ్చే వారం నుంచి జరిగే కార్యక్రమంలోనైనా లోపాలను సరిదిద్దుకోవాలని నగర వాసులు కోరారు.




ఆసక్తిగా తిలకిస్తున్న జనం

నగరంలో సూర్య సందడి



తమిళ హీరో సూర్య ఆదివారం నగరంలో సందడి చేశారు. కంగువా చిత్ర ప్రమోషన్‌లో భాగంగా నోవాటెల్‌లో మీడియాతో మాట్లాడుతూ ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుందన్నారు.

- 10లో



ప్రాణం తీసిన వేగం

- ఇద్దరు వ్యక్తులు దుర్మరణం
- వారిలో ఒకరు ఇంజనీరింగ్ విద్యార్థి
- ఆనందపురం వద్ద జాతీయ రహదారిపై ఘటన



సంఘటనా స్థలం



మృతుడు ధనుంజయ్ (ఫైల్ ఫొటో)

ఆనందపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):

అతి వేగం రెండు నిండు ప్రాణాలను బలిగొంది. ఈ సంఘటన ఆనందపురం మండలం గుమ్మడిపాలెం వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి సుమారు 7.30 గంటల ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

పెందుర్తికి చెందిన దొడ్డి ధనుంజయ్ (20), మోహనసాయి, మరికొంత మంది స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనాలపై ఆదివారం భీమిలి బీచ్‌కు వెళ్లారు. సాయంత్రం వరకు అక్కడ సరదాగా గడిపిన వారు రాత్రి 7 గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. ధనుంజయ్, మోహనసాయి బజాజ్ ఆర్15 బైక్‌పై అమితవేగంతో వెళ్తుండగా గుమ్మిడివానిపాలెం వద్ద రోడ్డు దాటుతున్న అదే గ్రామానికి చెందిన కోరాడ చిట్టిబాబు (60)ను ఢీకొన్నారు. దీంతో అదుపుతప్పిన బైక్ డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రోడ్డు దాటుతున్న చిట్టిబాబు, బైక్ వెనుక కూర్చున్న ధనుంజయ్ (20) అక్కడికక్కడే మృతిచెందగా, బైక్ నడుపుతున్న మోహనసాయికి తీవ్రగాయాలయ్యాయి. అతడిని వెంటనే తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి సీఐ చింతా వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పెందుర్తి ఆదిత్యనగర్‌కు చెందిన చిరు వ్యాపారి దొడ్డి రామకృష్ణ కుమారుడు దొడ్డి ధనుంజయ్ గీతం కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతుండగా, అతడి మిత్రుడు మోహనసాయి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

స్టీల్‌ప్లాంటులో నేడు మహా ధర్నా



ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):

విశాఖ స్టీల్‌ప్లాంటులో సోమవారం కార్మిక మహాధర్నా జరగనుంది. హక్కుల పరిరక్షణ, స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సమ్మె చేసేందుకు ఉద్యోగ సంఘం నాయకులు ఈ నెల 14న ఉక్కు యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ప్లాంటు ప్రస్తుత పరిస్థితులు, కార్మిక సమ్మెతో ఎదురయ్యే ఇబ్బందులపై యాజమాన్య ప్రతినిధులు సెంట్రల్ లేబర్ కమిషనర్ (సీఎల్‌సీ) సమక్షంలో ఉక్కు కార్మిక సంఘ నాయకులతో సమావేశమై సమ్మెను విరమించుకోవాలని కోరారు. దీంతోపాటు సమ్మెకు జాతీయ ఎన్‌జేసీఎస్ సంఘాలు మాత్రమే నోటీసు ఇవ్వడం, మిగిలిన సంఘాలు, కాంట్రాక్టు కార్మిక సంఘాలు దూరంగా ఉండడంతో సమ్మెను విరమించుకుంటున్నామని కార్మిక సంఘ నాయకులు స్పష్టం చేశారు. అయితే ప్లాంటు ప్రధాన పరిపాలన భవనం ఎదుట మహాధర్నా చేస్తామని తేల్చిచెప్పాయి. కాగా మహాధర్నాలో కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొననుండడంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

అక్రమ తవ్వకాలపై విజిలెన్స్

- గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్ పరిశీలన
- ఏపీఐఐసీ నుంచి వివరాలు కోరిన అధికారులు

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌లో కొందరు ప్లాట్ల యజమానులు అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టడంపై గనులశాఖ శాఖ, విజయనగరంలో గనులశాఖ విజిలెన్స్ అధికారులు దృష్టిసారించారు. భారీగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి లేవుట్‌లో ప్లాట్లు ఫిల్లింగ్ చేయడంపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలపై స్పందించారు. ఉత్తరాంధ్ర విజిలెన్స్ విభాగం అధికారి మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఓ బృందం లేఅవుట్‌ను తనిఖీ చేసింది. గ్రావెల్ తవ్విన లేఅవుట్‌కు సంబంధించిన రికార్డులు సమర్పించాలని ఏపీఐఐసీ అధికారులను కోరింది. అంతకుముందు గనులశాఖ జిల్లా అధికారి జగన్నాథరావు ఆదేశాలతో సిబ్బంది గుర్రంపాలెం లేఅవుట్‌ను సందర్శించి, రికార్డులు ఇవ్వాలని ఏపీఐఐసీ అధికారులను కోరారు. అయితే సుమారు ఐదారు నెలల నుంచి లేఅవుట్‌లో కొందరు యజమానులు కొండ నుంచి

... మిగతా 8వ పేజీలో

దీపావళి శుభాకాంక్షలు

- కాలుష్య రహిత దీపావళి జరుపుకుందాం.. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన ప్రకృతి సంపదను అందిద్దాం.
- దీపావళి దీపాల పండుగ - శబ్ధ, వాయు కాలుష్యం లేకుండా సురక్షితంగా జరుపుకుందాం...
- హరిత టపాసులనే (గ్రీన్ క్రాకర్స్) కాలుద్దాం... కాలుష్యాన్ని తగ్గిదాం...
- దీపావళినాడు రాత్రి 8 నుండి 10 గంటలలోపు మాత్రమే టపాసులు కాల్చండి.
- బాంబుల వంటివాటిని ఇరుకైన ప్రాంతాల్లో కాకుండా విశాల ప్రదేశాల్లో కాల్చండి.
- టపాసులు కాల్చేముందు చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు వంటివాళ్లను దృష్టిలో పెట్టుకోండి.
- మట్టి ప్రమిదల దీపాలనే వెలిగిద్దాం.. కాలుష్యాన్ని నివారిద్దాం.
- దీపావళి నాడు ఇంటికి చేసే అలంకరణలోగానీ, ఇతర అవసరాల్లో గానీ ప్లాస్టిక్ వాడకండి.
- టపాసులు కాల్చేముందు తడి రుమాలును ముక్కుకి కట్టుకోండి.. కాలుష్య కారకాలు ఊపిరితిత్తుల్లోకి వెళ్లవు.
- టపాసులు కాల్చేముందు పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోండి.

నేడు స్టీల్‌ప్లాంటులో బ్లాస్ట్‌ఫర్నేస్-1 పునఃప్రారంభం



... మెయిన్‌లో



పైడిరాజును అభినందిస్తున్న ఎంపీ శ్రీభరత్

అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో పైడిరాజుకు కాంస్యం

సాగర్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గీతం దంత వైద్య కళాశాల ఆస్పత్రిలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న కనకల పైడిరాజు ఈనెల 10 నుంచి 19 వరకు మలేషియాలోని బుకత్‌జలీల్ స్టేడియంలో జరిగిన 36వ మలేషియా ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో కాంస్య పతకం గెలుపొందారు. ఆమె 800 మీటర్ల పరుగు పందెంలో ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ ఆదివారం ఆమెను అభినందించారు.

ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ



శిక్షకులకు డబ్బులు అందిస్తున్న శ్రీరామ్

తగరపువలస, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌ఎంఎంఎస్ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఆ సంస్థకు చెందిన ఎం.ఆనందబాబు విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా ప్రత్యేక స్టడీ మెటీరియల్ తయారు చేసి అందించారు. ఈ కార్యక్రమంలో విశాఖ వీఎస్ కృష్ణ కళాశాల సూపరింటెండెంట్ జీవీ అప్పారావు, జిల్లా రీసోర్సు పర్సన్లు ఎం. సూర్యారావు, ఆర్. భరత్, జి. మోహనరావు, కార్యదర్శి రేఖ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

భీమునిపట్నం : చిట్టివలసలో ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు శిక్షణ పొందుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ నిమిత్తం కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ రూ. పది వేల ఆర్థిక సహాయాన్ని అందించింది. ఆదివారం విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఎఫ్‌ఈఎస్ ప్రతినిధులకు ఫౌండేషన్ చైర్మన్ కె. శ్రీరామచంద్రమూర్తి ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఈఎస్ వ్యవస్థాపకుడు గంటా మోహనరావు, కోశాధికారి బంటు అప్పారావు, యాగంటి రమణ, తదితరులు పాల్గొన్నారు.

110 మందికి వైద్య పరీక్షలు



వృద్ధుడ్ని పరీక్షిస్తున్న వైద్యుడు

మధురవాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోతుల మల్లయ్యపాలెంలోని తారకరామనగర్‌లో అద్వితీయ ఓల్డేజ్ హోమ్, డా.దిలీప్ రాజా సూపర్ స్పెషాలిటీ క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. 50 ఏళ్లు పైబడిన సుమారు 110 మందికి డాక్టర్ వై. దిలీప్‌రాజు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. వృద్ధులకు ఆరోగ్యపరంగా ఎదురయ్యే సమస్యలను గుర్తించి తగిన వైద్య సహాయం అందించే ఉద్దేశంతో వైద్య శిబిరం నిర్వహించినట్టు ఓల్డేజ్ హోం నిర్వాహకురాలు మల్లిక పేర్కొన్నారు. కార్యక్రమంలో యెర్ని సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాడవీధిలోకి టూరిస్టు బస్సు

సింహాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి మాడవీధుల్లో సిబ్బంది నిబంధనలకు తిలోదకాలిచ్చారు. నిబంధనల ప్రకారం మాడవీధుల్లోకి ఎటువంటి ప్రైవేటు టూరిస్టు బస్సులను అనుమతించరాదు. కానీ ఆదివారం మధ్యాహ్నం ప్రైవేటు సంస్థకు చెందిన టూరిస్టు బస్సు కొందరి పర్యాటకులను తీసుకురాగా దాన్ని పాత పీఆర్‌ఓ కార్యాలయం వరకు తీసుకువచ్చి పార్కింగ్ చేయడం విమర్శలకు తావిస్తోంది. పర్యాటక శాఖకు చెందిన బస్సుల్లో ప్రతి నిత్యం వృద్ధులు, దివ్యాంగులు వస్తున్నప్పటికీ వారిని కారు పార్కింగ్‌కు సమీపంలో దించేసే విధానం నడుస్తోంది. అందుకు విరుద్ధంగా టూరిస్టు బస్సు మాడవీధిలోకి రావడం చర్చనీయాంశమైంది.

ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు

కంచరపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిస కావడంతో అప్పుల పాలైన ప్రభుత్వ ఉద్యోగి అదృశ్యమైన ఘటన కంచరపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక కైలాసపురం నివాసి అగ్రహారపు శ్రీనివాస్ ప్రభుత్వ ఉద్యోగి. గతంలో సస్పెండై, మూడేళ్ల అనంతరం ఉద్యోగంలో చేరాడు. ఇటీవల మద్యానికి బానిసై అప్పుల పాలయ్యాడు. ఆగస్టు నుంచి ఇంటికి రాకపోవడంతో విధులకు వెళ్తున్నారని భార్య రత్నం భావించింది. తరు వాత అసలు విషయం తెలుసుకున్న ఆమె అతని ఆచూకీ కోసం వెతికింది. ఎక్కడా కనిపించకపోవడంతో ఆదివారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ చంద్రశేఖర్ నేతృత్వంలో ఏఎస్ఐ రాజు దర్యాప్తు చేస్తున్నారు.



రెడ్డిపల్లి గ్రామంలో అధ్వానంగా ఉన్న రోడ్డు



అసంపూర్తిగా ఉన్న పద్మనాభం-రెడ్డిపల్లి రోడ్డు

విస్తరణకు నోచుకోని రెడ్డిపల్లి-పద్మనాభం రోడ్డు

- మూడేళ్లుగా కదలని పనులు
- కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించని వైసీపీ ప్రభుత్వం

పద్మనాభం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : విజయనగరం-పద్మనాభం-శొంఠ్యాం రోడ్డు చాలా అధ్వానంగా ఉంది. పేరుకు రాష్ట్ర రహదారి అయినా అడుగడుగునా గోతులతో ఉండడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన ఈ రోడ్డులో రెడ్డిపల్లి కాన్వెంట్ నుంచి పద్మనాభం వరకు చేపట్టాల్సిన విస్తరణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. దీంతో విజయనగరం - విశాఖపట్నం జిల్లాలకు నిత్యం రాకపోకలు సాగించే వేలాది మంది ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణ కోసం గత ప్రభుత్వం న్యూ డెవలప్‌మెంటు బ్యాంకు నుంచి 10.04 కోట్లు మంజూరు చేసింది. ఈమేరకు 2021, మార్చి 31న అప్పటి రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు భూమి పూజ చేశారు. ఆరు నెలల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేసి అప్పగిస్తామన్నారు. కానీ నేటికీ రోడ్డు నిర్మాణం పూర్తికాలేదు. రెడ్డిపల్లి కాన్వెంటు నుంచి కిలోమీటరు వరకు, పద్మనాభం నుంచి రెడ్డిపల్లి జెడ్పీ పాఠశాల వరకు రెండు కిలోమీటర్ల వరకు విస్తరణ పనులు చేపట్టారు. మిగిలిన 1.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉంది. విస్తరణ చేపట్టిన రోడ్డులో పూర్తిస్థాయిలో బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. కానీ కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో మిగిలిన పనులు పూర్తి చేయలేదు. నిర్మాణం ప్రారంభించి మూడున్నరేళ్లు అయినా పూర్తి కాకపోవడంతో రోడ్డంతా పూర్తిగా శిథిలమై రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. గోతుల వల్ల వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు, పాలకులు, అధికారులు స్పందించి విస్తరణ పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పద్మనాభుని పవిత్రోత్సవాలు ప్రారంభం



అంకురార్పణ కార్యక్రమంలో భాగంగా మేదినీ దేవతకు పూజ చేస్తున్న అర్చకులు

పద్మనాభం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని దేవస్థానంలో పవిత్రోత్సవాలు ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఏడాది పొడవునా జరిగే ఉత్సవాలు, కార్యక్రమాల్లో ద్రవ్య దోషం తదితర దోషాల పరిహారం కోసం చేపట్టే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహం తదితర కార్యక్రమాలను వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం కుంతీమాధవస్వామి ఆలయం నుంచి పల్లకీపై గ్రామంలోని సంతబయలు కూడలికి ఊరేగింపుగా వెళ్లి అంకురార్పణ చేపట్టారు. అక్కడ మేదినీ దేవతకు వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మృత్తికను సేకరించారు. సేకరించిన మృత్తిక (పుట్టమన్ను)ను ఆలయ ప్రధాన అర్చకుడు సీతారామాంజనేయస్వామి ఆధ్వర్యంలో ఆలయానికి తీసుకువచ్చారు. గ్రామం, దేవాలయం, పాడి పంటలు సుభిక్షంగా ఉండడానికి ఈ కార్యక్రమం చేపట్టారు. వేద పండితుడు, అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రంగనాథస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె. రాంబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కె. నగేష్‌కుమార్, బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు మహేష్, ఉత్సవ కమిటీ సభ్యులు సన్యాసిరావు, పైడిరాజు, రాము, పద్దు, సన్నిబాబు, కోటి, అర్చకులు పవన్, వెంకటాచార్యులు, శర్మ పాల్గొన్నారు.



పంచకర్లకు అప్పన్న ఫొటో అందజేస్తున్న ఈఓ త్రినాథరావు

ఎమ్మెల్యే పంచకర్లను కలిసిన సింహాచలం ఈఓ

సింహాచలం,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు రమణాచార్యులు ఎమ్మెల్యేకు వేదాశీర్వచనాలు అందజేయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ ఆనందకుమార్, వాటర్ వర్క్స్ డీఈఈ డీవీఎస్ రామరాజు (హరి) పాల్గొన్నారు.

సింహాద్రినాథుడి స్వర్ణ పుష్పార్చనకు విశేష ఆదరణ

సింహాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఆలయ పద్మనిధి నుంచి బంగరు పుష్పాలు బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి, బేడామండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి స్వర్ణ పుష్పంతో పూజ చేశారు. తరువాత సహస్రనామ తులసీ దళార్చన, గరుడసేవ, నిత్య కల్యాణాలు వైభవంగా నిర్వహించారు.

'సభ్యత్వాల నమోదులో భీమిలి ముందుండాలి'



యాప్‌లో సభ్యత్వ నమోదు చేయిస్తున్న రవితేజ

కొమ్మాది, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదులో భీమిలి నియోజకవర్గం రాష్ట్రంలో ముందుండాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ అన్నారు. ఆరో వార్డు ఆర్‌హెచ్ కాలనీలో టీడీపీ నాయకుడు గరే గురునాథ్ ఆధ్వర్యంలో ఆదివారం సభ్యత్వాల నమోదు చేపట్టారు.ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి సహకరించిన వారందరికీ సభ్యత్వం ఉండేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు డి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ సొసైటీ ఎన్నికలకు సన్నాహాలు

మధురవాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తుండడంతో మధురవాడ సొసైటీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే స్థానిక నాయకులు సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులతో పాటు సభ్యులుగా పోటీ చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ఈమేరకు ఇటీవల ఒక పార్టీకి చెందిన ముఖ్య నాయకులు రహస్యంగా సమావేశమయ్యారు. 15 ఏళ్లుగా మధురవాడ పీఏసీఎస్ ప్రత్యేక అధికారి పాలనలో కొనసాగుతోంది. ఏటా సుమారు రూ. 40 లక్షల ఆదాయం సొసైటీకి సమకూరుతోంది. ఇటీవల జనరిక్ మందుల దుకాణం కూడా కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. పదేళ్ల కిందట ఎన్నికల నిర్వహణకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలు నిలిచిపోయాయి. 15 ఏళ్ల తరువాత మళ్లీ సొసైటీకి ఎన్నికలు జరగనుండడంతో పలువురు పదవులపై ఆశలు పెట్టుకుని అందుకు అనుగుణంగా పావులు కదుపుతున్నారు. నోటిఫికేషన్ ప్రకటించకముందే పదవులను ఏకగ్రీవం చేయాలని ప్రయత్నాలు ప్రారంభించారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో పశువుల సంచారం



రోడ్డుపై ఉన్న పశువులు

సింహాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ 98వ వార్డు పాతగోశాల కూడలి నుంచి పాత అడివివరం కూడలి వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డుపై పశువులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుపై సంచరిస్తున్న వాటిలో ఎక్కువగా అడివివరం గ్రామానికి చెందిన పశువులు ఉండగా, అప్పన్న స్వామికి మొక్కుబడిగా తొలిపావంచా వద్ద భక్తులు వదిలివెళ్లిన ఆవులు, దూడలు కూడా ఉన్నాయి. జీవీఎంసీ పశు సంచార నిరోధక విభాగం సిబ్బంది తక్షణమే స్పందించి పశువులను గో సంరక్షణ విభాగానికి తరలించాలని పలువురు కోరుతున్నారు.



సందర్శకులతో సందడిగా కనిపిస్తున్న రుషికొండ బీచ్

సందర్శకులతో కిటకిటలాడిన రుషికొండ బీచ్

సాగర్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడాయి. వీకెండ్‌కి తోడు బెంగాల్ సీజన్ కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొందరు బోటు షికార్ చేస్తూ.. సందడి చేయగా, మరికొందరు ఇసుక తిన్నెల్లో ఆటలు ఆడుతూ... సముద్రంలో స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. లైఫ్ గార్డులు సందర్శకులు ప్రమాదాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. కాగా బీచ్ రోడ్డు నుంచి రుషికొండ బీచ్‌లోకి వచ్చే మార్గంలోకి వాహనాలు ఎక్కువగా ప్రవేశించడంతో రద్దీ పెరిగిపోయి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



ఆలయంలో భక్తుల రద్దీ

సింహాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. వేకువజామునే ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొండదిగువన స్వామివారి పుష్కరిణిలో స్నానాలు చేసి, భైరవస్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి కొందరు కాలినడకన, మరికొందరు బస్సుల్లోనూ కొండపైకి చేరుకుని, స్వామివారిని దర్శించుకున్నారు.

పైలాన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలించిన కమిటీ సభ్యులు

భీమునిపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శత వసంతాల వేడుక సందర్భంగా ఏర్పాటు చేయనున్న పైలాన్ స్థలాన్ని ఉత్సవ కమిటీ ఆదివారం పరిశీలించింది. డిసెంబరు 14, 15 తేదీల్లో ఈ వేడుకలు జరగనున్నాయి. ఈమేరకు కమిటీ సభ్యులు పాఠశాల ఆవరణలో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు మాట్లాడుతూ భీమిలి చరిత్ర, పాఠశాల గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు తెలిసే విధంగా ఈ వేడుకలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారి పూసర్ల శ్రీను, ప్రతినిధులు పీఆర్‌పీ వర్మ, కనకల సన్యాసినాయుడు, కాళ్ల సన్నీ, కంటుభుక్త ముత్యాలరావు, ఆదినారాయణ, దారపు అప్పారావు, అత్తిలి సత్యనారాయణ,తట్టికోట భీమారావు, కట్టమూరి పద్మనాభరావు, ఉమ పాల్గొన్నారు.

మందకొడిగా..

... 7వ పేజీ తరువాయి

కళాశాల నుంచి హెచ్‌ఎం/ప్రిన్సిపాల్ కవరింగ్ లెటర్‌తో తహసీల్దార్లకు అప్పగించాలి. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే టీచర్లు/లెక్చరర్లు దరఖాస్తులను డీఈవో ధ్రువీకరించాలి. చివరి నిమిషంలో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వస్తే తహసీల్దార్లు ఉక్కిరిబిక్కిరవుతారని, ధ్రువీకరించడానికి డీఈవోలకు సమయం సరిపోదని భావిస్తున్నారు. కాగా ఓటరు నమోదుపై ఆరు జిల్లాల డీఈవోలు, ఆర్‌ఐవోలు, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి పలుమార్లు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.



శిథిలావస్థకు చేరుకుంటున్న కల్యాణ మండపం భవనం

నిరుపయోగంగా మునిసిపల్ కల్యాణ మండపం

భీమునిపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సీబీఎం స్కూల్ సమీపంలో ఉన్న మున్సిపల్ కల్యాణ మండపం కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉంది. కల్యాణ మండపానికి లీజు కాలపరిమితి ముగిసిన తరువాత వేలం వేయకుండా నిరుపయోగంగా వదిలేశారు. దీంతో భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. తలుపులు చెద పట్టి తాళాలు విరిగిపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. మందుబాబులు, గంజాయి సేవించే వారు ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడికి చేరి పరిసరాలను నాశనం చేస్తున్నారు. ఈ విషయమై జడ్సీ ప్రేమ ప్రసన్న వాణి వద్ద ప్రస్తావించగా కల్యాణ మండపానికి త్వరలోనే బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. యూసీడీ ఆధ్వర్యంలో ఉన్న మునిసిపల్ తోటవీధి కల్యాణ మండపాన్ని కూడా రెవెన్యూ విభాగానికి మార్పు చేసి, బహిరంగ వేలం వేస్తామని తెలిపారు.

తవ్వేసి.. వదిలేశారు!



ఎండాడ - రుషికొండ రహదారిపై తవ్విన గొయ్యి

ఎండాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడ కూడలి నుంచి రుషికొండకు వెళ్లే ప్రధాన మార్గంలో తాగునీటి పైపులైన్ మరమ్మతు కోసం గోతులు తవ్విన జీవీఎంసీ సిబ్బంది వాటిని పూడ్చకపోవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పైప్‌లైన్‌కు లీకులు ఏర్పడడంతో గొయ్యి ఏర్పడింది. జీవీఎంసీ సిబ్బంది మరమ్మతు చేసిన తరువాత గొయ్యి పూడ్చలేదు. దీంతో అటువైపు వెళుతున్న వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అలానే రాజీవ్‌నగర్‌కి వెళ్లే మార్గంలో కాలువలో పూడిక తీయడానికి పలక తొలగించారు. చెత్త తీసిన తరువాత పలకను తిరిగి వేయకపోవడంతో రాత్రివేళ పాదచారులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుపై గొయ్యి పూడ్చివేయడంతో పాటు కాలువపై పలక వేయాలని స్థానికులు కోరుతున్నారు.

వసూల్ ఖాకీలు

... 7వ పేజీ తరువాయి

సిబ్బంది మాత్రం ఇరువర్గాల నుంచి దండుకుంటున్నారు. ట్రాఫిక్ విభాగంలో డ్రంకెన్‌డ్రైవ్ పేరుతో దాదాపు అన్నిస్టేషన్ల పరిధిలోనూ పెద్దఎత్తున అవినీతి జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తనిఖీలు జరుగుతున్నపుడు మద్యం సేవించిన వాహన చోదకులు కేసులేకుండా వదిలిపెట్టాలని ప్రాధేయపడుతుంటారు. కేసు నమోదైతే కోర్టుకు వెళ్లి జరిమానా చెల్లించాల్సి ఉంటుందని కొందరు, పరువు పోతుందని మరికొందరు ఎంతోకొంత ఇచ్చి జారుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఇదేఅదనుగా సిబ్బంది భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇటీవల ఇద్దరు ట్రాఫిక్ ఎస్‌ఐలు, ఇద్దరు హోంగార్డులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల సందర్భంగా ఓ ఆటోడ్రైవర్‌ను బ్రోకర్‌గా నియమించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఫిర్యాదులు అందడంతో సీపీ వారిని సస్పెండ్ చేశారు. ఈ ఉదంతం నగర పోలీస్‌శాఖలో జరుగుతున్న వసూళ్ల పర్వానికి అద్దం పట్టింది.

నేర పరిశోధన విభాగంలో కూడా గుట్టుచప్పుడు కాకుండా స్క్రాప్ దుకాణాలు, హోటళ్లు, లాడ్జిల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నట్టు పోలీస్‌శాఖలో ప్రచారం జరుగుతోంది. రాత్రివేళ రోడ్డుపక్కన దుకాణాలు పెట్టుకుని వ్యాపారాలు సాగించేవారి నుంచి నైట్‌రౌండ్స్ తిరిగే సిబ్బంది వసూళ్లను ప్రారంభించినట్టు వ్యాపారులు వాపోతున్నారు.

నిద్రపోతున్న స్పెషల్ బ్రాంచి

సాధారణంగా ప్రతి పోలీస్‌స్టేషన్‌లో జరిగే కార్యకలాపాలపై నిఘా పెట్టేందుకు స్పెషల్‌బ్రాంచి విభాగం నుంచి ఒక ఏఎస్‌ఐ/హెడ్‌కానిస్టేబుల్ ఉంటారు. వీరు ఉదయం నుంచి రాత్రి వరకూ సీఐతోపాటు ఎస్‌ఐలు, సిబ్బంది ఎలా పనిచేస్తున్నారు, స్టేషన్‌కు వచ్చేవారితో ఎలా ప్రవర్తిస్తున్నారు, అవినీతికి సంబంధించి వ్యవహారాలపై నిఘా పెడతారు. స్టేషన్ పరిధిలోని దుకాణాలు, వ్యాపారులు, వాహన చోదకులు, లాడ్జిలు, హోటళ్ల వద్ద పోలీసులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారా? స్టేషన్‌లోని అధికారులు, సిబ్బంది పనితీరుపట్ల ప్రజల అభిప్రాయం ఆరా తీయాలి. ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల ద్వారా సీపీకి చేరవేయాలి. ఈ సమాచారం ఆధారంగా నగరంలో ఏం జరుగుతోందో సీపీకి అవగాహన ఏర్పడుతుంది. అయితే కొంతకాలంగా ఎస్‌బీ పనితీరు దారుణంగా మారింది. స్పెషల్‌బ్రాంచి సిబ్బంది ప్రజల్లో తిరగడం, పోలీస్‌స్టేషన్ కార్యక్రమాలపై నిఘా ఉంచడం మానేసి, స్టేషన్ పరిధిలో జరిగే ప్రెస్‌మీట్‌లు, ఆందోళనలకు హాజరై ఉన్నతాధికారులకు నివేదిక పంపించేసి చేతులు దులిపేసుకుంటున్నారు. దీనివల్ల పోలీస్‌శాఖ పనితీరు మరింత తీసికట్టుగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

యూజర్‌చార్జీల్లో చేతివాటం!

... 7వ పేజీ తరువాయి

ఇలా నవంబరు, డిసెంబరు నెలల్లో సుమారు రూ.ఐదు కోట్ల వరకూ వసూలైనట్టు అధికారులు అంచనావేస్తున్నారు. అయితే జీవీఎంసీ ఖాతాకు మాత్రం కేవలం రూ.రెండు కోట్లు మాత్రమే జమవగా, మిగిలిన మొత్తాన్ని కొంతమంది కార్యదర్శులు తమవద్దనే ఉంచారని అనుమానిస్తున్నారు. ఇటీవల పెందుర్తి(జోన్-8)లో ఎంతవరకు యూజర్ చార్జీలు జీవీఎంసీకి జమచేశారనేదానిపై కార్యదర్శుల చేతిలోని యాప్‌లను పరిశీలించగా సుమారు రూ.25 లక్షలు యాప్‌లోనే ఉన్నట్టు గుర్తించడం పరిస్థితికి అద్దంపడుతోంది. కాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యూజర్ చార్జీలను రద్దుచేసింది. అయితే వార్డుసచివాలయాల్లో పనిచేస్తున్న కొంతమంది కార్యదర్శులు, ప్రజారోగ్యం విభాగం సిబ్బంది ఇప్పటికీ హోటళ్లు, లాడ్జిలు, పార్లర్‌ల నుంచి అనధికారికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యాపారులు కూడా చెత్తను తరలించేందుకు వీలుగా జీవీఎంసీ సిబ్బందికి డబ్బు ఇచ్చేందుకు వెనుకాడడం లేదని అధికారులు అభిప్రాయపడుతున్నారు. నివాసాలకు యూజర్‌చార్జీలు రద్దుచేయడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని, వ్యాపారసంస్థల నుంచి వసూలును కొనసాగించి ఉంటే జీవీఎంసీకి ఆర్థిక భారం తగ్గేదని భావిస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు ఆలోచించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నారు.

అక్రమ తవ్వకాలపై విజిలెన్స్

... 7వ పేజీ తరువాయి

తవ్వకాలు చేపట్టారు. ఈ ప్రాంతంలో ఏ మేరకు గ్రావెల్ తవ్వారు? అనేది నిర్ధారించాలంటే గూగుల్‌మ్యాప్‌ల ఆధారంగా సర్వేచేయాలని గనుల శాఖ అధికారులు నిర్ణయించారు. ఏపీఐఐసీ అధికారులు రికార్డులు అందజేసిన తరువాత సర్వే చేయాలా? రికార్డులు ఇవ్వడంలో జాప్యం చేస్తే ఏ విధంగా ముందుకెళ్లాలి అనేదానిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది

తెలుగు సినిమా పాటల ప్రాణదాత 'సాలూరి'

మహారాణిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమా పాటలకు ప్రాణం పోసిన మహనీయుడు డాక్టర్ సాలూరి రాజేశ్వరరావు అని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు శ్లాఘించారు. ప్రముఖ సంగీత కళాకారిణి డాక్టర్ సుహాసిని ఆనంద్ రచించిన కళా ప్రపూర్ణ డాక్టర్ సాలూరి రాజేశ్వరరావు సినీ సంగీత సౌరభం పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జిల్లా పరిషత్ జంక్షన్ అంకోశా సమావేశమందిరంలో విశాఖ రసజ్ఞ వేదిక అంకోశా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సినిమాకు సంగీత సౌరభాలు అద్ది మనోరంజకంగా తీర్చిదిద్దారని జీఎస్ఎన్ రాజు కొనియాడారు.

సంక్షిప్తంగా..

హమ్మయ్యా.. గోతులు పూడ్చారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రోడ్డుపై పూడ్చిన గోతులు

వెంకోజీ పాలెం, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): గ్రేటర్ పరిధిలోని 15, 16 వార్డులలో ఎన్నికల ముందు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పునరుద్ధరణ కోసం త్రవ్విన గోతులను అసంపూర్ణంగా కప్పి వేసారని, దీని వలన పాదచారులు సైతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఇటీవల ఆంధ్రజ్యోతిలో వచ్చిన "అంతా గోతుల మయం" కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. రెండు వార్డులలోనూ గోతులను పూడ్చి, వాటిపై తారుతో ప్యాచ్ వర్క్‌లను చేశారు. దీంతో స్థానికులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పీవీ సింధుకు కేటాయించిన స్థలంలో జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలి

ఆరిలోవ, అక్టోబరు 27 : అంతర్జాతీయ షటిల్ బ్యాడింటన్ క్రీడాకారిణి పీవీ సింధుకు అకాడెమీకి ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని వాపసు తీసుకొని తోటగరువు జూనియర్ కళాశాలలకు కేటాయించాలని ఆరిలోవ వెనుకబడిన సేవా సంఘం ప్రతినిధి ఒమ్మి సన్యాసిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తోటగరువులో గల దుర్గమాంబ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తోటగరువు, ఆరిలోవ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను స్థానికులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. తోటగరువు జిల్లాపరిషత్తు హైస్కూలులో చదువు తర్వాత ఇంటర్, డిగ్రీ చేయాలంటే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, ఇక్కడ వెంటనే జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. పీవీ సింధుకు అకాడెమీ ఏర్పాటుకు ఇదే ప్రాంతంలో మరోచోట స్థలం కేటాయించాలని సూచించారు. అకాడమీ ఏర్పాటుకు ఎవరూ వ్యతిరేకం కాదన్నారు. సమావేశంలో సీపీఐ, సీపీఎంలకు చెందిన నరేంద్రకుమార్, ఎస్‌కె రెహమాన్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

శారదా పీఠంపై కక్ష సాధింపు తగదు

సిరిపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం శారదాపీఠంపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు డిమాండ్ చేశారు. ఆదివారం శారదాపీఠానికి మద్దతుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం కళ్ళకు నల్ల రిబ్బన్లు కట్టుకుని జన జాగరణ సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

సినిమా గైడ్

- వీనమ్ : మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం),శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- పొట్టేల్ : వెంకటేశ్వర, సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- ఎంతపనిచేసావ్ చంటి : వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- లగ్గం : విశేష్ (గాజువాక), తాతా (తగరపువలస)
- దేవర :జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- వేట్టయాన్ : సంగం, గోకుల్, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక)
- విశ్వం : శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- జనక అయితే గనక : శారద, కామేశ్వరి, హెవెన్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 39, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 50, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 46, బీరకాయలు 30, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 50, క్యాబేజీ 28, క్యారెట్ 54 దొండకాయలు 36, బంగాళ దుంపలు 31, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)60, బరబాటి 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 40, దోస కాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 48, కీరదోస 30, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 28, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	100
ఫారం ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు.. రోడ్లపై వాహనాలు

» ఎంపీవీ కాలనీలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద ట్రాఫిక్ సమస్య



ఓ ఫాస్ట్‌ఫుట్ సెంటర్ వద్ద రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ప్రధాన రహదారిలో ఇప్పటికే వాహన రద్దీ ఎక్కువగా ఉంది. దీనికి తోడు కొన్ని చోట్ల రోడ్డుపైనే చిరు తిండి దుకాణాలు వెలశాయి. దీంతో ఈ దుకాణల వద్దకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు. ఈ సమస్యను ట్రాఫిక్ పోలీసులు , జీవీఎంసీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. నగర పరిధిలోని 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ ఆరు, ఏడు సెక్టర్ల మధ్య ఉన్న వంతెనపై ఓ దుకాణం ఉంది. ఇక్కడ విపరీతమైన రద్దీ ఉంటుంది. పార్కింగ్ సదుపాయం లేదు. వాహనాలు రోడ్డుపైనే ఆపడం తప్ప మరో మార్గం లేదు. వంతెనపైనే వ్యాపారం చేసుకోవడానికి అనుమతి ఇచ్చిన అధికారుల తీరును ప్రయాణికులు తప్పుపడుతున్నారు. అవకాశం ఉన్న చోట వీరికి అనుమతి ఇవ్వాలి తప్ప రోడ్డుపైనే వ్యాపారం చేయడం వల్ల వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న ఆలోచన లేకపోవడం ఏమిటం టూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు, జీవీఎంసీ అధికారులు ఇక్కడ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న దుకాణాల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులు చదువు కోసం ఇబ్బంది పడకూడదు



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

సిరిపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభావంతులైన విద్యార్థులు ఎన్నడూ చదువుకోసం ఇబ్బందులు పడరాదని రోటరీ 3020 పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్కే జైన్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం జీవీఎంసీ ఎదురుగా ఓ హోటల్‌లో ఎల్ ఏంజెల్ వాలంటీర్స్ అసోసియేషన్, రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీతో కలిసి ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలో 85 శాతానికి పైగా మార్కులు సాధించిన 30 మంది ప్రతిభ గల పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన జైన్ మాట్లాడుతూ ఎల్‌ఏంజెల్ ఇంటర్నేషనల్ వాలంటీర్స్ అసోసియేషన్, ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్, రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ సహకారంతో మంచి కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. సీనియర్ రోటేరియన్ మండ వెంకటజానకిరామ్ మాట్లాడుతూ ప్రతిభ గల పేద విద్యార్థులు చదువుకునేందుకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదనే సంకల్పంతో ఈ నిధులు సమకూరుస్తున్నామన్నారు. విద్యార్థులు ఐఏఎస్, ఆ స్థాయిలో ఉన్నత ఉద్యోగాల్లో నిలవాలని ఆకాంక్షించారు. ప్రతిభతో పాటు కష్టించి పనిచేస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు ఎస్.హనుమంతరావు, బి.బాబ్జీ, జి.పాండురంగరాజు, సీఆర్ హేమంత్‌కుమార్, సీహెచ్ దుర్గాప్రసాద్, కె.వెంకటేశ్వరరావు, పీఎస్ఎన్ బెనర్జీ, సునీత లావణ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వెటరన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్-24 పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న క్రైం ఏడీసీపీ మోహనరావు

మద్దిలపాలెం, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) : విశాఖ పోర్టు స్టేడియంలో ఆదివారం విశాఖ జిల్లా వెటరన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్-24 పోటీలు నిర్వహించారు. వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో నగరం నుంచి 250 మంది క్రీడకారులు పాల్గొన్నారు. వీరికి 5 కిలోమీటర్ల వాకింగ్, 100 మీటర్ల నుంచి అయిదు కిలోమీటర్ల పరుగు పందెం, ట్రిపుల్ జంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కత్రో, జావెలెన్ త్రో, హేమర్ త్రో పోటీలు నిర్వహించారు. ఎస్.జలఉషా డిస్క్ త్రో, ట్రిపుల్‌జంప్‌లో ప్రథమ స్థానం, ఎం.సీతా మహాలక్ష్మీ హేమర్ త్రో, 5 కిలోమీటర్ల వాక్‌లో ప్రథమ స్థానం, ఎం.బాలరాజు ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న క్రైం ఏడీసీపీ విజేతలకు పతకాలు, ప్రసంశా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటాలన్నారు. కార్యక్రమంలో వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగ వరప్రసాద్, కార్యదర్శి సుధాకర్, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ కె.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలను నమోదు చేయిస్తున్న టీడీపీ నాయకులు

వెంకోజీపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. పార్టీ తూర్పు నియోజకవర్గం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ మాట్లాడుతూ ఈసారి సభ్యత్వాల సంఖ్యను మరింత పెరిగేలా చూడాలని నేతలు, కార్యకర్తలకు సూచించారు. కూటమి పాలనపై ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారన్నారు. సభ్యత్వం తీసుకునే వారికి బీమా సదుపాయం ఉంటుందన్నారు. అనంతరం పలువురి నుంచి సభ్యత్వాలను స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ 15వ వార్డు ప్రధాన కార్యదర్శి మళ్ల రవికుమార్, తెలుగు మహిళా అధ్యక్షురాలు కర్రి గౌరీ, సోని తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డులోని 551వ బూత్ పరిధి సింహగిరికాలనీలో ఆదివారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును చేపట్టారు. ఆ పార్టీ 9వ వార్డు ఇన్‌చార్జ్ బుడుమూరు గోవింద్ ఆధ్వర్యంలో సభ్యత్వాలను నమోదు చేశారు. సుమారు 60 మంది సభ్యత్వాలను స్వీకరించినట్టు గోవింద్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి గెడ్డవలస వెంకటరావు, బాలరాజు పాల్గొన్నారు.



టీడీపీ సభ్యత్వాలను స్వీకరిస్తున్న గోవింద్ తదితరులు

హోం మంత్రి అనితతో ఎమ్మెల్యే వంశీకృష్ణ భేటీ



హోం మంత్రి అనితకు పుష్పగుచ్చం అందిస్తున్న విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ

మద్దిలపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను ఆమె నివాసంలో ఆదివారం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలు, మహిళల భద్రతపై నిరంతరం శ్రమిస్తున్న హోంశాఖ మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలోని పలు అంశాలను చర్చించారు. కూటమి పార్టీల చేపట్టబోయే కార్యక్రమాలు, జిల్లా ప్రజల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలు మాట్లాడారు. అలాగే కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వంగా పేరుతెచ్చుకునే కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

జూ పార్కుకు సందర్శకుల తాకిడి

ఆరిలోవ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. సుమారు 3,330 మంది సందర్శించినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. టికెట్ల రూపంలో 3,01,920 ఆదాయం సమకూరినట్టు ఆమె వెల్లడించారు.

కోటినారాయణ యజ్ఞం విజయవంతం చేయాలి



విలేకరుల సమావేశంలో పాల్గొన్న పురోహితుల బృందం

చినవాల్తేరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కోటినారాయణ మహాయజ్ఞం విజయవంతం చేయాలని పెదవాల్తేరు లాసెన్స్ బే కాలనీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన పురోహితుడు భోగాపురపు సూర్యనారాయణ స్వామి భక్తులను కోరారు. దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము ప్రచురించిన కోటినారాయణ మహా యజ్ఞం పుస్తకంలో ఓం నమో నారాయణ అనే బీజాక్షరాలతో 1108 నామాలు రాసి డిసెంబరు 27న వేంకటేశ్వర స్వామికి జరిగే కలిశాభిషేకంలో భక్తులకు ఇచ్చిన కలశంలో తులసిద్రవ్యం గంధం వేసి 108 నాణేలు వేసి స్వామికి అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.. అనంతరం 2025, జనవరి1 న దేవస్థానంలో నిర్వహించే మహా పూర్ణాహుతి కార్యక్రమంలో కోటి నారాయణ మహాయజ్ఞ పుస్తకాలను సమర్పించాలని అన్నారు. ఈ సమావేసంలో ఎగ్జిక్యూటివ్ అధికారి కీర్తి ఆదినారాయణ, శివాలయం అర్చకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణను కలిసిన అప్పన్న దేవస్థానం ఈవో



ఎమ్మెల్యే వంశీకృష్ణను కలిసిన ఈవో

మద్దిలపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్‌ను ఆదివారం శివాజీపాలెంలో సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సింహాచలంఅర్చకులు వంశీకృష్ణకు వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం స్వామి వారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యతే మార్గం

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సమస్యల సాధనకు ఐకమత్యమే మార్గమని ఐఏఎస్ అధికారి డాక్టర్ టి.బాబూరావు నాయుడు అన్నారు. ఎంవీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం విశాఖ జిల్లా యూనిట్ డైమండ్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాబూరావు నాయుడు విచ్చేశారు. జాతీయ కమిటీ నాయకులు రమణ, తిరుపతిరావు, రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదరక్షి ప్రభాకర్, విశాఖ జిల్లా అధ్యక్షులు కోటేశ్వరరావు, కార్యదర్శి సత్యారావు తదితరులు ప్రసంగించారు.

మాలధారులకు నిత్యాన్నదానం ప్రారంభం



అన్నవితరణ చేస్తున్న గ్రామ సేవా సంఘం సభ్యులు

వెంకోజీపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీ పాలెంలోని గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే విధంగా వివిధ మాలధారులకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు ఇతర కార్యవర్గ సభ్యులు, అన్నదాత పాల్గొని స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు పీల కనకరాజు మాట్లాడుతూ 8 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఈ నిత్యాన్నదానాన్ని తు.చ. తప్పకుండా ఏటా కొనసాగిస్తూ వస్తున్నామన్నారు. దాతల సాయంతో ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు 41 రోజులు పాటు ఈ భిక్ష కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. మాలదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాళ్ల పోలినాయుడు, ఉపాధ్యక్షులు పీల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు మద్దాల వీరవెంకట అప్పారావు, ఆడిటర్ లోకేష్; ఆలయ కమిటీ సభ్యులు ఎస్.నరసింహారెడ్డి, కాళ్ల వరహాలు,సాంబ, మద్దాల నరసింగరావు, అప్పలరాజు, ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాలభాస్కరశర్మ పాల్గొన్నారు.

మిద్దె తోటలతో అందం, ఆరోగ్యం



మిద్దె తోటలు పెంచుతున్న బృందం

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటి మీద మిద్దె తోటలు పెంచడం వల్ల భవనానికి అందం, మనకు ఆరోగ్యం లభిస్తుందని వనమాలి, సీటీజీ గార్డెనింగ్, గ్రీన్ క్లైమేట్ టీం సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. ఏకో వైజాగ్ పేరిట ఎంవీపీ కాలనీతో పాటు నగరంలోని మురళీనగర్, ఎండాడ, మద్దిలపాలెం, గోపాలపట్నం, పెందుర్తి, ఎన్‌ఏడి, ఒన్‌టౌన్, ద్వారాకానగర్, అక్కయ్యపాలెం, సీతమ్మధార, కూర్మన్నపాలెం, గాజువాక తదితర ప్రాంతాల్లో ఆకుకూరల విత్తనాలను ఆదివారం పంపిణీ చేశారు. ఆయా సంస్థల ప్రతినిధులు జేవీ రత్నం, దనూషా, పూజిత, మేఘన, దీపిక, కుసుమ అపర్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు

పెదవాల్తేరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి). విద్యార్థుల్లో పోటీ తత్వం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందించాలని స్థితప్రజ్ఞ, ఆర్య వైశ్య యువజన సంఘం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వైవీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం పెదవాల్తేరులో గల వాసవీ భవన్‌లో నిర్వహించిన పెయింటింగ్, చిత్రలేఖన పోటీల్లో నగరంలోగల 30 పాఠశాలల నుంచి సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు. నవంబరు 14 చిల్డ్రన్స్ డే సందర్భంగా ఈ పోటీలను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. నవంబరు 3న క్విజ్ పోటీలు నవంబరు 9న ఫైర్‌లెస్ కుకింగ్. చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రదీప్, వెంకటేశ్, షీలా, ప్రశాంతి, దుర్గబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెలగపూడి రైతుబజార్ సందర్శన



రైతులు, కొనుగోలుదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైతు బజారును ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదివారం సందర్శించారు. రాష్ట్రంలోనే మోడల్ రైతు బజారుగా పేరొందిన ఎంవీపీ కాలనీ బజారును ఆయన సందర్శించి, రైతులు, వినియోగదారులతో మాట్లాడారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన రైతు బజార్ల వ్యవస్థ విజయవంతంగా నడుస్తోందని, దీనివల్ల అటు రైతులకు, ఇటు వినియోగదారులకు మేలు జరుగుతోందని అన్నారు. కొనుగోలుదారుల పట్ల రైతులు మర్యాద పూర్వకంగా మసలుకోవాలని సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం

» ద్వారకా ఏసీపీ రాంబాబు



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ఏసీపీ రాంబాబు

ఆరిలోవ, అక్టోబరు 27 : (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ద్వారాకా ఏసీపీ రాంబు పేర్కొన్నారు. ఆదివారం శ్రీకృష్ణాపురంలో గల అంబేడ్కర్ గురుకుల విద్యార్థులకు పలు చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలన్నారు. విద్యార్థి దశలో చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని, జ్ఞాన సముపార్జనపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని, దీనివల్ల జ్ఞాన పిపాస కలుగుతుందన్నారు. ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు. మద్యం, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు ఎల్లప్పుడూ దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆరిలోవ సీఐ మల్లేశ్వరావు, ఎస్ఐ కృష్ణ పాల్గొన్నారు.

2 నుంచి లయన్స్ క్లబ్‌లో చిల్డ్రన్స్ డే వేడుకలు

రామ్‌నగర్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 2 నుంచి రామ్‌నగర్ లయన్స్ క్లబ్‌లో 56వ చిల్డ్రన్స్ డే వేడుకలు నిర్వహిస్తున్నట్టు వేడుకల కమిటీ చైర్మన్ డి.ప్రసాద్‌రాజు తెలిపారు. ఆదివారం రామ్‌నగర్ లయన్స్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వేడుకల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 5,6,7 తరగతుల పిల్లలకు జూనియర్స్‌గా, 8,9,10 తరగతులకు సీనియర్స్‌గా విభజించి పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. 2వ తేదీన పెయింటింగ్, 3న వ్యాస రచన, పద్యపఠనం, స్టోరీ టెల్లింగ్, 5న క్విజ్, 6న డ్యాన్స్, 7న ఫ్యాన్సీ డ్రెస్‌మోనో యాక్షన్, 8న క్లాసిక్ సింగింగ్, 9న జానపద, దేశభక్తి గీతాల పాటలు, 10న యోగా, చెస్, 11న సైన్స్ ఫెయిర్, 12న బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు.

బాణసంచా వల్ల నష్టాలపై 30న చైతన్య శిబిరం

సిరిపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాణసంచా కాల్చటం ద్వారా వచ్చే దుష్పరిణామాల గురించి సుప్రీంకోర్టు సూచనలకు అనుగుణంగా యువతలో చైతన్య తీసుకొచ్చేందుకు ఈ నెల 30న బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు బీవీఎఫ్ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీవీపీ డిగ్రీ కళాశాల సెమినార్ హాలులో చైతన్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి కేజీహెచ్ ఈఎన్‌టీ సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ బి.మురళీకృష్ణ పాల్గొననున్నట్టు చెప్పారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటాలని చెబుతున్న సంఘ నేతలు

వెంకోజీపాలెం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఏదో ఒక చిన్న మొక్కనైనా నాటి భవిష్యత్తు తరాలకు పచ్చదనాన్ని అందించాలని కొత్తవెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు మద్దాల వీర వెంకటఅప్పారావు అన్నారు. వెంకటప్పారావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామస్థులందరితో శివాలయం ప్రాంగణంలో మొక్కలను నాటించారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా అందరూ ఆరోగ్య వంతులుగా జీవిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పీల కనకరాజు ఇతర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీపీ ఆదేశాలతో రోగిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు



బస్టాప్‌లో గాయాలతో ఉన్న వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి నగర సందర్శనలో భాగంగా లాసన్స్‌బే కాలనీ వైపు వెళుతుండగా శాంతి ఆశ్రమం ఎదురుగా బస్టాపులో గుర్తు తెలియని వ్యక్తి కాలికి తీవ్ర గాయంతో ఇబ్బంది పడుతుండడాన్ని గమనించారు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించడానికి ఏర్పాట్లు చేశారు. ఎంవీపీ కాలనీ స్టేషన్ సీఐ మురళికి సమాచారం అందించి, అతడిని కేజీహెచ్‌కు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే రెడ్ క్రాస్, పెద వాల్తేరు హోంలెస్ షెల్టర్ సిబ్బంది సహకారంతో ఆస్పత్రికి తరలించి వైద్యం అందించే ఏర్పాట్లు చేశారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



పూజ చేస్తున్న నిర్వాహకులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మురుగన్ స్కంద అసోసియేషన్ ఆధ్వర్యంలో 42, 43, 44 వార్డులకు చెందిన చెక్కుడురాయి బిల్డింగ్ సమీపంలో సుబ్రహ్మణ్య స్వామి ఆలయ నిర్మాణానికి టీడీపీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు షేక్ జుబేరు, అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు శ్రీను, నరేష్, సంతోష్, హరిశంకర్, రూప, సుజాత, లక్ష్మి, అలివేణి తదితరులు పాల్గొన్నారు.

కేవీలో రెండో రోజు స్కౌట్ శిబిరం



విన్యాసం చేస్తున్న స్కౌట్ విద్యార్థులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయం వాల్తేరులో జరుగుతున్న స్కౌట్, గైడ్స్ శిబిరం రెండోరోజు ఆదివారం కొనసాగింది. వ్యాయామంతో ప్రారంభమైన శిబిరంలో స్కౌట్ విద్యార్థులు వివిధ విన్యాసాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏఎల్‌టీ కేఆర్ జగన్నాథ్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జిత్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

'రుషికొండ ప్యాలెస్‌ను బుద్ధిస్ట్ మ్యూజియంగా ప్రకటించాలి'



నినదిస్తున్న బుద్ధిస్ట్ అసోసియేషన్ సభ్యులు

సీతమ్మధార, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాధనంతో నిర్మించిన రుషికొండ ప్యాలెస్‌ను మ్యూజియంగా ప్రకటించాలని బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్, నవయానం బహుజనుల హక్కుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. బౌద్ధ, జైన ధర్మానికి సంబంధించిన శిల్పాలు, అవశేషాలు, ఉత్తరాంధ్రలో బౌద్ధ చారిత్రక అవశేషాలను ఇందులో భద్రపరచాలని ప్రభుత్వానికి సూచించారు. రామాటాకీస్ వద్ద ఉన్న అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్యాలెస్‌ను తూర్పు తీర ప్రాంత మ్యూజియంగా కొనసాగిస్తే జాతీయ, అంతర్జాతీయ సెమినార్లకు, పరిశోధకులకు సాంకేతిక సౌకర్యాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ఎం.మల్లయ్యరాజు, జె.సుదర్శనం, ఎస్.ఎ.రావు, ఎస్.ధర్మారావు, జోనెల వాసు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారిగా గంగా భవాని



విజయవాడలో ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న గంగా భవాని

మహారాణిపేట, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నర్సింగ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కోశాధికారిగా విశాఖ జిల్లాకు చెందిన టి గంగా భవాని ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర సంఘ ఎన్నికల్లో విశాఖ జిల్లా నుంచి ఆమె పోటీ చేయగా, అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. రెండు ప్యానెళ్ల ఇటీవల విశాఖ జిల్లాలో హోరాహోరీగా తలపడిన ఎన్నికల్లో అధ్యక్షురాలిగా గంగా భవాని ఎన్నికైన సంగతి తెలిసిందే. రాష్ట్ర సంఘ పదవికి ఎన్నికైన ఆమెను పలువురు అభినందించారు.

ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు

కంచరపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసకావడంతో అప్పుల పాలైన ప్రభుత్వ ఉద్యోగి అదృశ్యమైన ఘటన కంచరపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక కైలాసపురం నివాసి అగ్రహారపు శ్రీనివాస్ ప్రభుత్వ ఉద్యోగి. గతంలో శ్రీనివాస్ సస్పెండై, మూడేళ్ల అనంతరం ఉద్యోగంలో చేరాడు. అయితే ఇటీవల మద్యానికి బానిసై అప్పుల పాలయ్యాడు. ఆగస్టు నుంచి ఇంటికి రాకపోవడంతో విధులకు వెళ్తున్నారని భార్య రత్నం భావించింది. ఆ తరువాత అసలు విషయం తెలుసుకున్న ఆమె అతని ఆచూకీ కోసం వెతికింది. ఎక్కడా కనిపించకపోవడంతో ఆదివారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ చంద్రశేఖర్ నేతృత్వంలో ఏఎస్ఐ రాజు దర్యాప్తు చేస్తున్నారు.

మసకబారిన హరిత ఉద్యానవనం 'ప్రభ'

- మురళీనగర్‌లో గాడితప్పిన పర్యవేక్షణ!
- కమిటీ సభ్యుల ఇష్టారాజ్యం

మురళీనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్థలంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన మురళీనగర్ పార్కులో పర్యవేక్షణ గాడి తప్పుతోంది. నిర్వాహక కమిటీ సభ్యులు వసతుల మెరుగుపై దృష్టి సారించకపోవడంతో ఉద్యానవనం కళతప్పుతోంది. రెండెకరాల ప్రభుత్వ స్థలంలో సెక్టర్ 8లోని కొండ పక్కగా దీన్ని ఏర్పాటు చేశారు. ఆహ్లాదకర వాతావరణాన్ని తొలుత ప్రోదిచేసినా, అయిదేళ్లుగా పర్యవేక్షణ కరువైంది. దీంతో సందర్శకులకు ఇందులో సేదతీరే ఆస్కారం లేకుండా పోతుంది.

పరిరక్షణ ఊసు లేదు

మురళీనగర్ హరిత పార్కులో నడకమార్గం, పిల్లల ఆట వస్తువులు, షటిల్ కోర్టు, క్రికెట్ నేర్చుకునేందుకు బాలబాలికలకు అకాడెమీ ఏర్పాటైంది. విలువైన ఆస్తుల్ని కాపాడాల్సిన నిర్వహణ కమిటీ సభ్యుల ఉదాసీనత పార్కు అభివృద్ధికి గొడ్డలి పెట్టుగా మారింది. ఈ పార్కు ఇపుడు ప్రేమ జంటల స్థావరంగా పేరుపడింది. ఉదయం 5 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 9 వరకు పార్కులు తెరిచి ఉండడం సహజం. కానీ ఇక్కడి పార్కు ద్వారం ఎల్లవేళలా తెరిచే ఉంటుంది. దీంతో కొందరు వేళ కాని వేళల్లో ప్రవేశించి నానా హైరానా చేస్తున్నారు. పట్టపగలే జంటలుగా వచ్చి అభ్యంతరకరంగా కనిపిస్తున్నా, ఇక్కడి వాచ్‌మన్ కుటుంబం నిరోధించడం లేదు. ఈ తంతుపై దగ్గరలో ఉన్న అపార్టుమెంట్ నివాసితులు ఫిర్యాదు చేస్తున్నారు. గంజాయి, లిక్కర్ బ్యాచ్‌కు ఈ పార్కు రాజమార్గంగా మారింది.



మురళీనగర్‌లోని హరిత పార్కు



చిరుజల్లుకే చిత్తడిలా మారుతున్న షటిల్ కోర్టు

నిరంతర వెలుగులు.. కుక్కల సంచారం

మురళీనగర్ ప్రాంతంలో కొన్ని పార్కులు చక్కగా వెలుగొందుతుంటే, హరిత పార్కు ప్రభ మసకబారుతోంది. పార్కులో హైమాస్ట్ దీపాలు కొన్ని నెలలుగా రేయింబవళ్లు వెలుగులు చిమ్ముతున్నా పట్టించుకోవడం లేదు. పార్కులో కళావేదిక ఫ్యాన్లు తిరగవు. రోజంతా కుక్కలు తిష్ట వేసి, పార్కులోపల స్వైర విహారం చేస్తూ పాదచారులను ఇబ్బంది పెడుతున్నాయి. కమిటీల పేరిట ఏళ్ల తరబడి తిష్ట వేసిన కొందరు రాజకీయ నేతలే పార్కులో హవా నడిపిస్తున్నారు. గత వైసీపీ పాలనలో ప్రజా ప్రతినిధి వెంట తిరిగిన అనుచరగణానిదే ఈ పార్కు అన్న చందంగా తయారైంది. సాయంత్రం కాగానే వారి రాజకీయ కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారు. ప్రతి రెండేళ్ల కోసారి మారాల్సిన కమిటీలో 2019 నుంచి ఒక్కరే అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఆర్నెల్ల క్రితం కట్టిన రోడ్డు వైపు స్థలంలోని దుకాణాల కేటాయింపు సైతం వారికి నచ్చిన వారికే ఇచ్చుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొద్ది నెలల క్రితం ఆరంభమైన క్రికెట్ అకాడెమీకి వీరు సహకరిస్తున్న తీరుపై క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పక్కనే ఉన్న ఓ ప్రైవేటు విద్యాసంస్థ విద్యార్థులు ఉదయం వేళ ఆట మైదానంగా మార్చుకున్నారు. పార్కులో ఎక్కడా తాగునీటి వసతి లేదు. నిర్దేశిత పార్కింగ్ సదుపాయం లేదు. కాలనీల్లో ఇళ్ల ముందే పార్కుకు వచ్చే వారి వాహనాలు నిలిపేయడంతో వారితో వాదనలకు దిగడం ఇక్కడ పరిపాటిగా మారింది. జీవీఎంసీ అధికారులు, ఇతర బాధ్యులు ఇప్పటికైనా స్పందించి దీన్ని చక్కదిద్దాలని మురళీనగర్ వాసులు కోరుకుంటున్నారు.

ఆసుపత్రుల అభివృద్ధిపై ఎమ్మెల్యేల చర్చ



విష్ణుకుమార్‌రాజుతో సంభాషిస్తున్న వెలగపూడి రామకృష్ణబాబు

సీతమ్మధార, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా విశాఖలో ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేసే విషయమై ఇద్దరూ చర్చించారు.

నిరుపేదలకు భోజనం ప్యాకెట్ల పంపిణీ

అక్కయ్యపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శంకువానిపాలెంలోని వాగ్దేవి పాఠశాల ఆవరణలో ఆదివారం నిరుపేదలకు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ 13 ఏళ్ల నుంచి క్రమం తప్పక నిర్విరామంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీవీ సత్యనారాయణ, జి.బ్రహ్మానందకుమార్‌ల ఆర్థికసాయంతో అన్నార్తులకు నారాయణ సేవ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ద్వారకానగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీజీ లక్ష్మీనారాయణ, కార్యదర్శి ప్రసాదరావు, బి.హనుమంతరావు, డైరెక్టర్ ఎ.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు త్వరలో పరిష్కారం: ఎమ్మెల్యే వంశీకృష్ణ



ఎర్రగెడ్డను అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

జ్ఞానాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురానికి ఎన్నో ఏళ్లుగా ఉన్న ఎర్రగెడ్డ ముంపు సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతానని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రజలకు హామీ ఇచ్చారు. జీవీఎంసీ 41వ వార్డు పరిధిలోని జ్ఞానాపురం, జెఎన్ఎన్ఎంయూఆర్ఎం, బాబు, సెబాస్టియన్ కాలనీల్లో జోన్-5 అధికారులతో కలసి ఆయన ఆదివారం పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న యూజీడీ పనులు, నిర్మాణంలో ఉన్న కళ్యాణమండపం, నిలిచిపోయిన మరియదాసు కళ్యాణమండపాలను పరిశీలించారు. సెబాస్టియన్ కాలనీలో రోడ్లు తవ్వి వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. వెంటనే ఆయన అధికారులతో మాట్లాడుతూ ప్రజలు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించాలని, సకాలంలో రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. జోనల్ కమిషనర్ బి.రాము, వైద్యాధికారి సునీల్ కుమార్, ఈఈ ప్రసన్నరెడ్డి, ఏపీడీ పద్మావతి, నాయకులు ఐతి మధుబాబు, సంజీవరావు, కర్రి బానోజీరావు, ఆంథోని, శేఖర్, ఆర్.ఐ కె.శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ బజారు ప్రారంభం

అల్లిపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పిస్తూ, ప్రోత్సాహం అందించేందుకు మెప్మా ఏర్పాటు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జోన్-4 కార్యాలయంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ బజారును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. ఈ ప్రదర్శన ప్రతీ నెల ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. యూసీడీ పీడీ ఫణిరాం, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఏపీడీ పద్మావతి పాల్గొన్నారు.

రొమ్ములో గడ్డలకు తక్షణ చికిత్స అవసరం



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డాక్టర్ శివానంద తదితరులు

జగదాంబ కూడలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రొమ్ము క్యాన్సర్ పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద పేర్కొన్నారు. ఆదివారం గ్రేటర్ 30వవార్డు శాలిపేట కమ్యూనిటీ హాలులో చైతన్య స్రవంతి సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలిదశలో రొమ్ము క్యాన్సర్ గుర్తించి వైద్య చికిత్సలు అందిస్తే ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చన్నారు. పేద, మధ్య తరగతి మహిళలకు కేజీహెచ్ లో అధునాతన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కీమోథెరపీ, బ్రాకీ థెరపీ సేవలు పూర్తి స్థాయిలో పొందవచ్చని వెల్లడించారు. చైతన్య స్రవంతి సేవా సంస్థ సేవలను ఆయన ప్రశంసించారు. చైతన్య స్రవంతి చైర్‌పర్సన్ డాక్టర్ శిరీన్ రహమాన్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా వివిధ వ్యాధులపై ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. రొమ్ములో గడ్డలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే మెమొగ్రామ్ పరీక్ష చేయించుకోవాలన్నారు. క్యాన్సర్ విభాగం అధిపతి డాక్టర్ పాండురంగ కుమారి మాట్లాడుతూ తొలి రెండుదశల్లో గుర్తించి వైద్య చికిత్సలు అందిస్తే రొమ్ము క్యాన్సర్ పూర్తిగా నయం కావచ్చునన్నారు. ఈ విషయమై ముద్రించిన బ్రోచర్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద , ఇతర ప్రముఖులు, మహిళలు విడుదల చేశారు.

తెలుగుసినిమా పాటల ప్రాణదాత 'సాలూరి'



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

మహారాణిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమా పాటలకు ప్రాణం పోసిన మహనీయుడు డాక్టర్ సాలూరి రాజేశ్వరరావు అని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు శ్లాఘించారు. ప్రముఖ సంగీత కళాకారిణి డాక్టర్ సుహాసిని ఆనంద్ రచించిన కళాప్రపూర్ణ డాక్టర్ సాలూరి రాజేశ్వరావు సినీ సంగీత సౌరభం పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జిల్లా పరిషత్ జంక్షన్ అంకోశా సమావేశమందిరంలో విశాఖ రసజ్ఞ వేదిక అంకోశా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సినిమాకు సంగీత సౌరభాలు అద్ది మనోరంజకంగా తీర్చిదిద్దారని జీఎస్ఎన్ రాజు కొనియాడారు. డాక్టర్ రఘురామారావు మాట్లాడుతూ తెలుగు చలనచిత్రాలకు సంగీత స్వరాలను శాసించిన సంగీత సామ్రాట్ సాలూరి అని అన్నారు. సంగీతంపై పరిశోధన చేసిన సుహాసిని ఆనంద్ మాట్లాడుతూ సంగీత ప్రియులకు సాలూరి ఆదర్శ ప్రాయులన్నారు. ఈ సమావేశంలో పాలగుమ్మి రాజగోపాల్, కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ ఎస్కేఈ అప్పారావు, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'నివాసాల నడుమ మద్యం దుకాణం తగదు'



నిరసన తెలుపుతున్న స్థానికులు

మహారాణిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నివాస స్థలాల నడుమ మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ స్థానిక మహిళలు పందిమెట్ట జంక్షన్ వద్ద ఆదివారం వంటావార్పు నిర్వహించారు. అక్కడే భోజనాలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ప్రభుత్వానికి లేదా, నూతన మద్యం విధానానికి తాము వ్యతిరేకులం కాదని, నివాసాల మధ్య దుకాణం నిర్వహించాలనుకోవడంపైనే తమ అభ్యంతరమని పేర్కొన్నారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటైతే అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని, అందువల్ల ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని కోరారు. పలువురు మహిళలు పాల్గొన్నారు.

విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ బాలోత్సవాన్ని నవంబరు 19 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు కార్యదర్శి జీపిస్ రాజేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఇందుకు సంబంధించిన గోడప్రతిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖరరావు, ప్రొఫెసర్ పద్మ హాజరయ్యారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోపాలరావు, మురళీధర్, పరశురామ్, శేషగిరిరావు పాల్గొన్నారు.

మనిషి జీవన గమనానికి మంచి నీరే ఆయుధం..

డాబాగార్డెన్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవన గమనానికి మంచి నీరే ఆయుధమని పలువురు నిపుణులు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం సిరిపురంలోని ఓ హోటల్‌లో హైడ్రోజన్ వాటర్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పిశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ హైడ్రోజన్ వాటర్‌పై నిపుణులతో పాటు అనేక పరిశోధనలు చేసిన వైద్యులు, అనుభజ్ఞులచే యువత, వినియోగదారులకు అవగాహన కలిగించామన్నారు. మంచినీట్లో పీహెచ్ శాతాన్ని వారంతా వివరించారు. మనిషి జీవన గమనానికి, ఆరోగ్య పరిశుభ్రతకు శుద్ధి చేసిన నీరు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంఎల్ కంట్రీ హెడ్ రవికాంత్, శ్రీనివాస్, డాక్టర్ అప్పారావు, డాక్టర్ జయకుమార్, రొటేరియన్ థాడోడ్, భిమిల్ తదితరులు పాల్గొన్నారు.

వసూల్ ఖాకీలు

... 7వ పేజీ తరువాయి

సిబ్బంది మాత్రం ఇరువర్గాల నుంచి దండుకుంటున్నారు. ట్రాఫిక్ విభాగంలో డ్రంకెన్‌డ్రైవ్ పేరుతో దాదాపు అన్నిస్టేషన్ల పరిధిలోనూ పెద్దఎత్తున అవినీతి జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తనిఖీలు జరుగుతున్నపుడు మద్యం సేవించిన వాహన చోదకులు కేసులేకుండా వదిలిపెట్టాలని ప్రాధేయపడుతుంటారు. కేసు నమోదైతే కోర్టుకు వెళ్లి జరిమానా చెల్లించాల్సి ఉంటుందని కొందరు, పరువు పోతుందని మరికొందరు ఎంతో కొంత ఇచ్చి జారుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఇదేఅదనుగా సిబ్బంది భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇటీవల ఇద్దరు ట్రాఫిక్ ఎస్ఐలు, ఇద్దరు హోంగార్డులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల సందర్భంగా ఓ ఆటోడ్రైవర్‌ను బ్రోకర్‌గా నియమించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఫిర్యాదులు అందడంతో సీపీ వారిని సస్పెండ్ చేశారు. ఈ ఉదంతం నగర పోలీస్‌శాఖలో జరుగుతున్న వసూళ్ల పర్వానికి అద్దం పట్టింది. నేర పరిశోధన విభాగంలో కూడా గుట్టుచప్పుడు కాకుండా స్క్రాప్ దుకాణాలు, హోటళ్లు, లాడ్జిల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నట్టు పోలీస్‌శాఖలో ప్రచారం జరుగుతోంది. రాత్రివేళ రోడ్డుపక్కన దుకాణాలు పెట్టుకుని వ్యాపారాలు సాగించేవారి నుంచి నైట్‌రౌండ్స్ తిరిగే సిబ్బంది వసూళ్లను ప్రారంభించినట్టు వ్యాపారులు వాపోతున్నారు.

నిద్రపోతున్న స్పెషల్ బ్రాంచి

సాధారణంగా ప్రతి పోలీస్‌స్టేషన్‌లో జరిగే కార్యకలాపాలపై నిఘా పెట్టేందుకు స్పెషల్ బ్రాంచి విభాగం నుంచి ఒక ఏఎస్ఐ/హెడ్‌కానిస్టేబుల్ ఉంటారు. వీరు ఉదయం నుంచి రాత్రి వరకూ సీఐతోపాటు ఎస్ఐలు, సిబ్బంది ఎలా పనిచేస్తున్నారు, స్టేషన్‌కు వచ్చేవారితో ఎలా ప్రవర్తిస్తున్నారు, అవినీతికి సంబంధించి వ్యవహారాలపై నిఘా పెడతారు. స్టేషన్ పరిధిలోని దుకాణాలు, వ్యాపారులు, వాహనచోదకులు, లాడ్జిలు, హోటళ్ల వద్ద పోలీసులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారా? స్టేషన్‌లోని అధికారులు, సిబ్బంది పనితీరుపట్ల ప్రజల అభిప్రాయం ఆరా తీయాలి. ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల ద్వారా సీపీకి చేరవేయాలి. ఈ సమాచారం ఆధారంగా నగరంలో ఏం జరుగుతోందో సీపీకి అవగాహన ఏర్పడుతుంది. స్పెషల్‌బ్రాంచి సిబ్బంది ప్రజల్లో తిరగడం, పోలీస్‌స్టేషన్ కార్యక్రమాలపై నిఘా ఉంచడం మానేసి, స్టేషన్ పరిధిలో జరిగే ప్రెస్‌మీట్‌లు, ఆందోళనలకు హాజరై ఉన్నతాధికారులకు నివేదిక పంపించేసి చేతులు దులిపేసుకుంటున్నారు. దీనివల్ల పోలీస్‌శాఖ పనితీరు మరింత తీసికట్టుగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

యూజర్‌చార్జీల్లో చేతివాటం!

... 7వ పేజీ తరువాయి

ఇలా నవంబరు, డిసెంబరు నెలల్లో సుమారు రూ.ఐదు కోట్ల వరకూ వసూలైనట్టు అధికారులు అంచనావేస్తున్నారు. అయితే జీవీఎంసీ ఖాతాకు మాత్రం కేవలం రూ.రెండు కోట్లు మాత్రమే జమవగా, మిగిలిన మొత్తాన్ని కొంతమంది కార్యదర్శులు తమవద్దనే ఉంచారని అనుమానిస్తున్నారు. ఇటీవల పెందుర్తి(జోన్-8)లో ఎంతవరకు యూజర్ చార్జీలు జీవీఎంసీకి జమచేశారనేదానిపై కార్యదర్శుల చేతిలోని యాప్‌లను పరిశీలించగా సుమారు రూ.25 లక్షలు యాప్‌లోనే ఉన్నట్టు గుర్తించడం పరిస్థితికి అద్దంపడుతోంది.

ఇంకా అనధికార వసూళ్లు : అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యూజర్ చార్జీలను రద్దుచేసింది. అయితే వార్డుసచివాలయాల్లో పనిచేస్తున్న కొంతమంది కార్యదర్శులు, ప్రజారోగ్యం విభాగం సిబ్బంది ఇప్పటికీ హోటళ్ల, లాడ్జిలు, పార్లర్‌ల నుంచి అనధికారికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యాపారులు కూడా చెత్తను తరలించేందుకు వీలుగా జీవీఎంసీ సిబ్బందికి డబ్బు ఇచ్చేందుకు వెనుకాడడం లేదని అధికారులు అభిప్రాయపడుతున్నారు. నివాసాలకు యూజర్ చార్జీలు రద్దుచేయడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని, వ్యాపారసంస్థల నుంచి వసూలును కొనసాగించి ఉంటే జీవీఎంసీకి ఆర్థిక భారం తగ్గేదని భావిస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు ఆలోచించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నారు.

గ్రామీణ క్రికెటర్ల ప్రోత్సాహానికి ప్రత్యేక ప్రణాళిక

- ఏసీఏ కార్యవర్గ సన్మాన కార్యక్రమంలో కేశినేని శివనాథ్

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా ఎన్నికైన ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) కార్యవర్గాన్ని విశాఖ జిల్లా క్రికెట్ సంఘం (వీడీసీఏ) ఆదివారం సన్మానించింది. ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రికెట్‌ను అభివృద్ధి చేసి ప్రతిభ గల క్రికెటర్లను ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళతామని పేర్కొన్నారు. బీసీసీఐ సహకారంతో రాష్ట్రంలో మరిన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించడమే కాకుండా ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఆధునిక వసతులు కల్పిస్తామన్నారు. ఆటగాళ్లకు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రంలో నార్త్, సౌత్, సెంట్రల్ జోన్‌లలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలను ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు చేస్తున్నామని పేర్కొన్నారు. అన్ని జిల్లాల క్రికెట్ సంఘాలతో సమన్వయం పాటించి సలహాలు, సూచనల మేరకు క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యం జాగ్రత్త



శిబిరానికి వచ్చిన వారిని పరీక్షిస్తున్న వైద్యులు

మురళీనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి); మారిన ఆహారపు అలవాట్లు, జీవన విధానం, వెలుగు చూస్తున్న కొత్త కారణాల వల్ల ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని అపోలో హాస్పిటల్స్ గుండె వ్యాధుల నిపుణుడు టి.రవికాంత్ సూచించారు. ఒత్తిడిని నియంత్రించుకుంటూనే, అధిక బరువు ప్రమాదాన్ని ఆదిలోనే గుర్తించాలన్నారు. ఆదివారం మురళీనగర్ వాకర్స్‌క్లబ్ పార్కులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పలువురిని పరీక్షించారు. గుండె వ్యాధుల బారిన పడకుండా మనం తీసుకునే ఆహారంలో కొవ్వు పదార్థాలు, నూనెల వాడకాన్ని తగ్గించాలన్నారు. నిత్య వ్యాయామం ప్రతి ఒక్కరికీ శ్రీరామ రక్షగా పనిచేస్తుందని తెలిపిన డాక్టర్ రవికాంత్ మద్యం, సిగరెట్ అలవాట్లను మానుకోవాలని సూచించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పల్లా చంద్రమౌళి పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో క్లబ్ సభ్యులు నిర్వహణ ఏర్పాట్లు చేపట్టారు. మధుమేహ వైద్య నిపుణులు దీరజ్ ఈ వ్యాధి నియంత్రకు పాటించాల్సిన వైద్య సలహాలు అందించారు. వైద్య సిబ్బంది ఈసీజీ పరీక్షలు సహా దంత వైద్య చికిత్సలు అందించారు. 184 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమ నిర్వహణలో క్లబ్ కోశాధికారి జె.కూర్మారావు, పూర్వ అధ్యక్షులు బుచ్చయ్య చౌదరి, కార్యవర్గ సభ్యులు సహకరించారు.

మందకొడిగా...

... 7వ పేజీ తరువాయి

కళాశాల నుంచి హెచ్ఎం/ప్రిన్సిపాల్ కవరింగ్ లెటర్‌తో తహసీల్దార్లకు అప్పగించాలి. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే టీచర్లు/లెక్చరర్లు దరఖాస్తులను డీఈవో ధ్రువీకరించాలి. చివరి నిమిషంలో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వస్తే తహసీల్దార్లు ఉక్కిరిబిక్కిరవుతారని, ధ్రువీకరించడానికి డీఈవోలకు సమయం సరిపోదని భావిస్తున్నారు. ఇదిలావుండగా ఓటరు నమోదుపై ఆరు జిల్లాల డీఈవోలు, ఆర్ఐవోలు, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి పలుమార్లు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

అక్రమ తవ్వకాలపై విజిలెన్స్



గ్రావెల్‌తో నింపిన గుర్రంపాలెం లేఅవుట్

... 7వ పేజీ తరువాయి

తవ్వకాలు చేపట్టారు. ఈ ప్రాంతంలో ఏ మేరకు గ్రావెల్ తవ్వారు? అనేది నిర్ధారించాలంటే గూగుల్‌మ్యాప్‌ల ఆధారంగా సర్వేచేయాలని గనుల శాఖ అధికారులు నిర్ణయించారు. ఏపీఐఐసీ అధికారులు రికార్డులు అందజేసిన తరువాత సర్వే చేయాలా? రికార్డులు ఇవ్వడంలో జాప్యం చేస్తే ఏ విధంగా ముందుకెళ్లాలి అనేదానిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

☛ సంక్షిప్తంగా..

హమ్మయ్యా.. గోతులు పూడ్చారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రోడ్డుపై పూడ్చిన గోతులు

వెంకోజీపాలెం, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): గ్రేటర్ పరిధిలోని 15, 16 వార్డులలో ఎన్నికల ముందు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పునరుద్ధరణ కోసం త్రవ్విన గోతులను అసంపూర్ణంగా కప్పి వేసారని, దీని వలన పాదచారులు సైతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఇటీవల ఆంధ్రజ్యోతిలో వచ్చిన "అంతా గోతుల మయం" కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. రెండు వార్డుల లోనూ గోతులను పూడ్చి, వాటిపై తారుతో ప్యాచ్ వర్క్‌లను చేశారు. దీంతో స్థానికులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పీవీ సింధుకు కేటాయించిన స్థలంలో జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలి

ఆరిలోవ, అక్టోబరు 27 : అంతర్జాతీయ షటిల్ బ్యాడింటన్ క్రీడాకారిణి పీవీ సింధుకు అకాడెమీకి ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని వాపసు తీసుకొని తోటగరువు జూనియర్ కళాశాలలకు కేటాయించాలని ఆరిలోవ వెనుకబడిన సేవా సంఘం ప్రతినిధి ఒమ్మి సన్యాసిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తోటగరువులో గల దుర్గమాంబ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తోటగరువు, ఆరిలోవ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను స్థానికులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. తోటగరువు జిల్లాపరిషత్తు హైస్కూలులో చదువు తర్వాత ఇంటర్, డిగ్రీ చేయాలంటే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, ఇక్కడ వెంటనే జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. పీవీ సింధుకు అకాడెమీ ఏర్పాటుకు ఇదే ప్రాంతంలో మరోచోట స్థలం కేటాయించాలని సూచించారు. అకాడమీ ఏర్పాటుకు ఎవరూ వ్యతిరేకం కాదన్నారు. సమావేశంలో సీపీఐ, సీపీఎంలకు చెందిన నరేంద్రకుమార్, ఎస్‌కె రెహమాన్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

శారదా పీఠంపై కక్ష సాధింపు తగదు

సిరిపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం శారదాపీఠంపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు డిమాండ్ చేశారు. ఆదివారం శారదాపీఠానికి మద్దతుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం కళ్ళకు నల్ల రిబ్బన్లు కట్టుకుని జన జాగరణ సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

సినిమా గైడ్

● వీనమ్ : మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం),శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
● పొట్టేల్ : వెంకటేశ్వర, సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● ఎంతపనిచేసావ్ చంటి : వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
● లగ్గం : విశేష్ (గాజువాక), తాతా (తగరపువలస)
● దేవర :జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
● వేట్టయాన్ : సంగం, గోకుల్, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక)
● విశ్వం : శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● జనక అయితే గనక : శారద, కామేశ్వరి, హెవెన్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 39, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 50, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 46, బీరకాయలు 30, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 50, క్యాబేజీ 28, క్యారెట్ 54 దొండకాయలు 36, బంగాళ దుంపలు 31, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)60, బరబాటి 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 40, దోస కాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 48, కీరదోస 30, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 28, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	100
ఫారం ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు.. రోడ్లపై వాహనాలు

» ఎంపీవీ కాలనీలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద ట్రాఫిక్ సమస్య



ఓ ఫాస్ట్‌ఫుట్ సెంటర్ వద్ద రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ప్రధాన రహదారిలో ఇప్పటికే వాహన రద్దీ ఎక్కువగా ఉంది. దీనికి తోడు కొన్ని చోట్ల రోడ్డుపైనే చిరు తిండి దుకాణాలు వెలశాయి. దీంతో ఈ దుకాణల వద్దకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు. ఈ సమస్యను ట్రాఫిక్ పోలీసులు , జీవీఎంసీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. నగర పరిధిలోని 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ ఆరు, ఏడు సెక్టర్ల మధ్య ఉన్న వంతెనపై ఓ దుకాణం ఉంది. ఇక్కడ విపరీతమైన రద్దీ ఉంటుంది. పార్కింగ్ సదుపాయం లేదు. వాహనాలు రోడ్డుపైనే ఆపడం తప్ప మరో మార్గం లేదు. వంతెనపైనే వ్యాపారం చేసుకోవడానికి అనుమతి ఇచ్చిన అధికారుల తీరును ప్రయాణికులు తప్పుపడుతున్నారు. అవకాశం ఉన్న చోట వీరికి అనుమతి ఇవ్వాలి తప్ప రోడ్డుపైనే వ్యాపారం చేయడం వల్ల వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న ఆలోచన లేకపోవడం ఏమిటం టూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు, జీవీఎంసీ అధికారులు ఇక్కడ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న దుకాణాల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులు చదువు కోసం ఇబ్బంది పడకూడదు



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

సిరిపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభావంతులైన విద్యార్థులు ఎన్నడూ చదువుకోసం ఇబ్బందులు పడరాదని రోటరీ 3020 పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్కే జైన్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం జీవీఎంసీ ఎదురుగా ఓ హోటల్‌లో ఎల్ ఏంజెల్ వాలంటీర్స్ అసోసియేషన్, రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీతో కలిసి ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలో 85 శాతానికి పైగా మార్కులు సాధించిన 30 మంది ప్రతిభ గల పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన జైన్ మాట్లాడుతూ ఎల్‌ఏంజెల్ ఇంటర్నేషనల్ వాలంటీర్స్ అసోసియేషన్, ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్, రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ సహకారంతో మంచి కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. సీనియర్ రొటేరియన్ మండ వెంకటజానకిరామ్ మాట్లాడుతూ ప్రతిభ గల పేద విద్యార్థులు చదువుకునేందుకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదనే సంకల్పంతో ఈ నిధులు సమకూరుస్తున్నామన్నారు. విద్యార్థులు ఐఏఎస్, ఆ స్థాయిలో ఉన్నత ఉద్యోగాల్లో నిలవాలని ఆకాంక్షించారు. ప్రతిభతో పాటు కష్టించి పనిచేస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు ఎస్.హనుమంతరావు, బి.బాబ్జీ, జి.పాండురంగరాజు, సీఆర్ హేమంత్‌కుమార్, సీహెచ్ దుర్గాప్రసాద్, కె.వెంకటేశ్వరరావు, పీఎస్ఎన్ బెనర్జీ, సునీత లావణ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వెటరన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్-24 పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న క్రైం ఏడీసీపీ మోహనరావు

మద్దిలపాలెం, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) : విశాఖ పోర్టు స్టేడియంలో ఆదివారం విశాఖ జిల్లా వెటరన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్-24 పోటీలు నిర్వహించారు. వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో నగరం నుంచి 250 మంది క్రీడకారులు పాల్గొన్నారు. వీరికి 5 కిలోమీటర్ల వాకింగ్, 100 మీటర్ల నుంచి అయిదు కిలోమీటర్ల పరుగు పందెం, ట్రిపుల్ జంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్క్‌త్రో, జావెలిన్ త్రో, హేమర్ త్రో పోటీలు నిర్వహించారు. ఎస్.జలఉషా డిస్క్ త్రో, ట్రిపుల్‌జంప్‌లో ప్రథమ స్థానం, ఎం.సీతా మహాలక్ష్మీ హేమర్ త్రో, 5 కిలోమీటర్ల వాక్‌లో ప్రథమ స్థానం, ఎం.బాలరాజు ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న క్రైం ఏడీసీపీ విజేతలకు పతకాలు, ప్రసంశా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటాలన్నారు. కార్యక్రమంలో వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగ వరప్రసాద్, కార్యదర్శి సుధాకర్, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ కె.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలను నమోదు చేయిస్తున్న టీడీపీ నాయకులు

వెంకోజీపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. పార్టీ తూర్పు నియోజకవర్గం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ మాట్లాడుతూ ఈసారి సభ్యత్వాల సంఖ్యను మరింత పెరిగేలా చూడాలని నేతలు, కార్యకర్తలకు సూచించారు. కూటమి పాలనపై ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారన్నారు. సభ్యత్వం తీసుకునే వారికి బీమా సదుపాయం ఉంటుందన్నారు. అనంతరం పలువురి నుంచి సభ్యత్వాలను స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ 15వ వార్డు ప్రధాన కార్యదర్శి మళ్ల రవికుమార్, తెలుగు మహిళా అధ్యక్షురాలు కర్రి గౌరీ, సోని తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డులోని 551వ బూత్ పరిధి సింహగిరికాలనీలో ఆదివారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును చేపట్టారు. ఆ పార్టీ 9వ వార్డు ఇన్‌చార్జ్ బుడుమూరు గోవింద్ ఆధ్వర్యంలో సభ్యత్వాలను నమోదు చేశారు. సుమారు 60 మంది సభ్యత్వాలను స్వీకరించినట్టు గోవింద్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి గెడ్డవలస వెంకటరావు, బాలరాజు పాల్గొన్నారు.



టీడీపీ సభ్యత్వాలను స్వీకరిస్తున్న గోవింద్ తదితరులు

హోం మంత్రి అనితతో ఎమ్మెల్యే వంశీకృష్ణ భేటీ



హోం మంత్రి అనితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ

మద్దిలపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను ఆమె నివాసంలో ఆదివారం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలు, మహిళల భద్రతపై నిరంతరం శ్రమిస్తున్న హోంశాఖ మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలోని పలు అంశాలను చర్చించారు. కూటమి పార్టీల చేపట్టబోయే కార్యక్రమాలు, జిల్లా ప్రజల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలు మాట్లాడారు. అలాగే కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వంగా పేరుతెచ్చుకునే కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

జూ పార్కుకు సందర్శకుల తాకిడి

ఆరిలోవ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. సుమారు 3,330 మంది సందర్శించినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. టికెట్ల రూపంలో 3,01,920 ఆదాయం సమకూరినట్టు ఆమె వెల్లడించారు.

కోటినారాయణ యజ్ఞం విజయవంతం చేయాలి



విలేకరుల సమావేశంలో పాల్గొన్న పురోహితుల బృందం

చినవాల్తేరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కోటినారాయణ మహాయజ్ఞం విజయవంతం చేయాలని పెదవాల్తేరు లాసెన్స్ బే కాలనీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన పురోహితుడు బోగాపురపు సూర్యనారాయణ స్వామి భక్తులను కోరారు. దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము ప్రచురించిన కోటినారాయణ మహా యజ్ఞం పుస్తకంలో ఓం నమో నారాయణ అనే బీజాక్షరాలతో 1108 నామాలు రాసి డిసెంబరు 27న వేంకటేశ్వర స్వామికి జరిగే కలిశాభిషేకంలో భక్తులకు ఇచ్చిన కలశంలో తులసిద్రవ్యం గంధం వేసి 108 నాణేలు వేసి స్వామికి అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.. అనంతరం 2025, జనవరి1 న దేవస్థానంలో నిర్వహించే మహా పూర్ణాహుతి కార్యక్రమంలో కోటి నారాయణ మహాయజ్ఞ పుస్తకాలను సమర్పించాలని అన్నారు. ఈ సమావేసంలో ఎగ్జిక్యూటివ్ అధికారి కీర్తి ఆదినారాయణ, శివాలయం అర్చకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణను కలిసిన అప్పన్న దేవస్థానం ఈవో



ఎమ్మెల్యే వంశీకృష్ణను కలిసిన ఈవో

మద్దిలపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్‌ను ఆదివారం శివాజీపాలెంలో సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సింహాచలంఅర్చకులు వంశీకృష్ణకు వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం స్వామి వారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యతే మార్గం

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సమస్యల సాధనకు ఐకమత్యమే మార్గమని ఐఏఎస్ అధికారి డాక్టర్ టి.బాబూరావు నాయుడు అన్నారు. ఎంవీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం విశాఖ జిల్లా యూనిట్ డైమండ్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాబూరావు నాయుడు విచ్చేశారు. జాతీయ కమిటీ నాయకులు రమణ, తిరుపతిరావు, రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదరక్షు ప్రభాకర్, విశాఖ జిల్లా అధ్యక్షులు కోటేశ్వరరావు, కార్యదర్శి సత్యారావు తదితరులు ప్రసంగించారు.

మాలధారులకు నిత్యాన్నదానం ప్రారంభం



అన్నవితరణ చేస్తున్న గ్రామ సేవా సంఘం సభ్యులు

వెంకోజీపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే విధంగా వివిధ మాలధారులకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు ఇతర కార్యవర్గ సభ్యులు, అన్నదాత పాల్గొని స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు పీల కనకరాజు మాట్లాడుతూ 8 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఈ నిత్యాన్నదానాన్ని తు.చ. తప్పకుండా ఏటా కొనసాగిస్తూ వస్తున్నామన్నారు. దాతల సాయంతో ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు 41 రోజులు పాటు ఈ భిక్ష కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. మాలదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాళ్ల పోలినాయుడు, ఉపాధ్యక్షులు పీల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు మద్దాల వీరవెంకట అప్పారావు, ఆడిటర్ లోకేష్; ఆలయ కమిటీ సభ్యులు ఎస్.నరసింహారెడ్డి, కాళ్ల వరహాలు,సాంబ, మద్దాల నరసింగరావు, అప్పలరాజు, ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాలభాస్కరశర్మ పాల్గొన్నారు.

మిద్దె తోటలతో అందం, ఆరోగ్యం



మిద్దె తోటలు పెంచుతున్న బృందం

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటి మీద మిద్దె తోటలు పెంచడం వల్ల భవనానికి అందం, మనకు ఆరోగ్యం లభిస్తుందని వనమాలి, సీటీజీ గార్డెనింగ్, గ్రీన్ క్లైమేట్ టీం సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. ఏకో వైజాగ్ పేరిట ఎంవీపీ కాలనీతో పాటు నగరంలోని మురళీనగర్, ఎండాడ, మద్దిలపాలెం, గోపాలపట్నం, పెందుర్తి, ఎన్ఏడి, ఒన్‌టౌన్, ద్వారాకానగర్, అక్కయ్యపాలెం, సీతమ్మధార, కూర్మన్నపాలెం, గాజువాక తదితర ప్రాంతాల్లో ఆకుకూరల విత్తనాలను ఆదివారం పంపిణీ చేశారు. ఆయా సంస్థల ప్రతినిధులు జేవీ రత్నం, దనూషా, పూజిత, మేఘన, దీపిక, కుసుమ అపర్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు

పెదవాల్తేరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి). విద్యార్థుల్లో పోటీ తత్వం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందించాలని స్థితప్రజ్ఞ, ఆర్య వైశ్య యువజన సంఘం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వైవీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం పెదవాల్తేరులో గల వాసవీ భవన్‌లో నిర్వహించిన పెయింటింగ్, చిత్రలేఖన పోటీల్లో నగరంలోగల 30 పాఠశాలల నుంచి సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు. నవంబరు 14 చిల్డ్రన్స్ డే సందర్భంగా ఈ పోటీలను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. నవంబరు 3న క్విజ్ పోటీలు నవంబరు 9న ఫైర్‌లెస్ కుకింగ్. చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.ప్రదీప్, వెంకటేశ్, షీలా, ప్రశాంతి, దుర్గబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెలగపూడి రైతుబజార్ సందర్శన



రైతులు, కొనుగోలుదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైతు బజారును ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదివారం సందర్శించారు. రాష్ట్రంలోనే మోడల్ రైతు బజారుగా పేరొందిన ఎంవీపీ కాలనీ బజారును ఆయన సందర్శించి, రైతులు, వినియోగదారులతో మాట్లాడారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన రైతు బజార్ల వ్యవస్థ విజయవంతంగా నడుస్తోందని, దీనివల్ల అటు రైతులకు, ఇటు వినియోగదారులకు మేలు జరుగుతోందని అన్నారు. కొనుగోలుదారుల పట్ల రైతులు మర్యాద పూర్వకంగా మసలుకోవాలని సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం

» ద్వారకా ఏసీపీ రాంబాబు



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ఏసీపీ రాంబాబు

ఆరిలోవ, అక్టోబరు 27 : (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ద్వారకా ఏసీపీ రాంబు పేర్కొన్నారు. ఆదివారం శ్రీకృష్ణాపురంలో గల అంబేడ్కర్ గురుకుల విద్యార్థులకు పలు చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలన్నారు. విద్యార్థి దశలో చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని, జ్ఞాన సముపార్జనపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని, దీనివల్ల జ్ఞాన పిపాస కలుగుతుందన్నారు. ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు. మద్యం, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు ఎల్లప్పుడూ దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆరిలోవ సీఐ మల్లేశ్వరావు, ఎస్ఐ కృష్ణ పాల్గొన్నారు.

2 నుంచి లయన్స్ క్లబ్‌లో చిల్డ్రన్స్ డే వేడుకలు

రామ్‌నగర్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 2 నుంచి రామ్‌నగర్ లయన్స్ క్లబ్‌లో 56వ చిల్డ్రన్స్ డే వేడుకలు నిర్వహిస్తున్నట్టు వేడుకల కమిటీ చైర్మన్ డి.ప్రసాద్‌రాజు తెలిపారు. ఆదివారం రామ్‌నగర్ లయన్స్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వేడుకల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 5,6,7 తరగతుల పిల్లలకు జూనియర్స్‌గా, 8,9,10 తరగతులకు సీనియర్స్‌గా విభజించి పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. 2వ తేదీన పెయింటింగ్, 3న వ్యాసరచన, పద్యపఠనం, స్టోరీ టెల్లింగ్, 5న క్విజ్, 6న డ్యాన్స్, 7న ఫ్యాన్సీ డ్రెస్‌మోనో యాక్షన్, 8న క్లాసిక్ సింగింగ్, 9న జానపద, దేశభక్తి గీతాల పాటలు, 10న యోగా, చెస్, 11న సైన్స్ ఫెయిర్, 12న బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు.

బాణసంచా వల్ల నష్టాలపై 30న చైతన్య శిబిరం

సిరిపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాణసంచా కాల్చటం ద్వారా వచ్చే దుష్పరిణామాల గురించి సుప్రీంకోర్టు సూచనలకు అనుగుణంగా యువతలో చైతన్య తీసుకొచ్చేందుకు ఈ నెల 30న బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు బీవీఎఫ్ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీవీపీ డిగ్రీ కళాశాల సెమినార్ హాలులో చైతన్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి కేజీహెచ్ ఈఎన్‌టీ సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ బి.మురళీకృష్ణ పాల్గొననున్నట్టు చెప్పారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటాలని చెబుతున్న సంఘ నేతలు

వెంకోజీపాలెం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఏదో ఒక చిన్న మొక్కనైనా నాటి భవిష్యత్తు తరాలకు పచ్చదనాన్ని అందించాలని కొత్తవెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు మద్దాల వీర వెంకటఅప్పారావు అన్నారు. వెంకటప్పారావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామస్థులందరితో శివాలయం ప్రాంగణంలో మొక్కలను నాటించారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా అందరూ ఆరోగ్య వంతులుగా జీవిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పీల కనకరాజు ఇతర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీపీ ఆదేశాలతో రోగిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు



బస్టాప్‌లో గాయాలతో ఉన్న వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి నగర సందర్శనలో భాగంగా లాసన్స్‌బే కాలనీ వైపు వెళుతుండగా శాంతి ఆశ్రమం ఎదురుగా బస్టాపులో గుర్తు తెలియని వ్యక్తి కాలికి తీవ్ర గాయంతో ఇబ్బంది పడుతుండాన్ని గమనించారు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించడానికి ఏర్పాట్లు చేశారు. ఎంవీపీ కాలనీ స్టేషన్ సీఐ మురళికి సమాచారం అందించి, అతడిని కేజీహెచ్‌కు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే రెడ్ క్రాస్, పెద వాల్తేరు హోంలెస్ షెల్టర్ సిబ్బంది సహకారంతో ఆస్పత్రికి తరలించి వైద్యం అందించే ఏర్పాట్లు చేశారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



పూజ చేస్తున్న నిర్వాహకులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మురుగన్ స్కంద అసోసియేషన్ ఆధ్వర్యంలో 42, 43, 44 వార్డులకు చెందిన చెక్కుడురాయి బిల్డింగ్ సమీపంలో సుబ్రహ్మణ్య స్వామి ఆలయ నిర్మాణానికి టీడీపీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు షేక్ జుబేరు, అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు శ్రీను, నరేష్, సంతోష్, హరిశంకర్, రూప, సుజాత, లక్ష్మి, అలివేణి తదితరులు పాల్గొన్నారు.

కేవీలో రెండో రోజు స్కౌట్ శిబిరం



విన్యాసం చేస్తున్న స్కౌట్ విద్యార్థులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయం వాల్తేరులో జరుగుతున్న స్కౌట్, గైడ్స్ శిబిరం రెండోరోజు ఆదివారం కొనసాగింది. వ్యాయామంతో ప్రారంభమైన శిబిరంలో స్కౌట్ విద్యార్థులు వివిధ విన్యాసాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏఎల్‌టీ కేఆర్ జగన్నాథ్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జిత్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

'రుషికొండ ప్యాలెస్‌ను బుద్ధిస్ట్ మ్యూజియంగా ప్రకటించాలి'



నినదిస్తున్న బుద్ధిస్ట్ అసోసియేషన్ సభ్యులు

సీతమ్మధార, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాధనంతో నిర్మించిన రుషికొండ ప్యాలెస్‌ను మ్యూజియంగా ప్రకటించాలని బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్, నవయానం బహుజనుల హక్కుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. బౌద్ధ, జైన ధర్మానికి సంబంధించిన శిల్పాలు, అవశేషాలు, ఉత్తరాంధ్రలో బౌద్ధ చారిత్రక అవశేషాలను ఇందులో భద్రపరచాలని ప్రభుత్వానికి సూచించారు. రామాటాకీస్ వద్ద నున్న అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్యాలెస్‌ను తూర్పు తీర ప్రాంత మ్యూజియంగా కొనసాగిస్తే జాతీయ, అంతర్జాతీయ సెమినార్లకు, పరిశోధకులకు సాంకేతిక సౌకర్యాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ఎం.మళ్లయ్యరాజు, జె.సుదర్శనం, ఎస్.ఎ.రావు, ఎన్.ధర్మారావు, జోసెల వాసు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారిగా గంగా భవాని



విజయవాడలో ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న గంగా భవాని

మహారాణిపేట, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నర్సింగ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కోశాధికారిగా విశాఖ జిల్లాకు చెందిన టి గంగా భవాని ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర సంఘ ఎన్నికల్లో విశాఖ జిల్లా నుంచి ఆమె పోటీ చేయగా, అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. రెండు ప్యానెళ్లు ఇటీవల విశాఖ జిల్లాలో హోరాహోరీగా తలపడిన ఎన్నికల్లో అధ్యక్షురాలిగా గంగా భవాని ఎన్నికైన సంగతి తెలిసిందే. రాష్ట్ర సంఘ పదవికి ఎన్నికైన ఆమెను పలువురు అభినందించారు.

ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు

కంచరపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసకావడంతో అప్పుల పాలైన ప్రభుత్వ ఉద్యోగి అదృశ్యమైన ఘటన కంచరపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక కైలాసపురం నివాసి అగ్రహారపు శ్రీనివాస్ ప్రభుత్వ ఉద్యోగి. గతంలో శ్రీనివాస్ సస్పెండై, మూడేళ్ల అనంతరం ఉద్యోగంలో చేరాడు. అయితే ఇటీవల మద్యానికి బానిసై అప్పుల పాలయ్యాడు. ఆగస్టు నుంచి ఇంటికి రాకపోవడంతో విధులకు వెళ్తున్నారని భార్య రత్నం భావించింది. ఆ తరువాత అసలు విషయం తెలుసుకున్న ఆమె అతని ఆచూకీ కోసం వెతికింది. ఎక్కడా కనిపించకపోవడంతో ఆదివారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ చంద్రశేఖర్ నేతృత్వంలో ఏఎస్ఐ రాజు దర్యాప్తు చేస్తున్నారు.

మసకబారిన హరిత ఉద్యానవనం 'ప్రభ'

- మురళీనగర్‌లో గాడితప్పిన పర్యవేక్షణ!
- కమిటీ సభ్యుల ఇష్టారాజ్యం

మురళీనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్థలంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన మురళీనగర్ పార్కులో పర్యవేక్షణ గాడి తప్పుతోంది. నిర్వాహక కమిటీ సభ్యులు వసతుల మెరుగుపై దృష్టి సారించకపోవడంతో ఉద్యానవనం కళతప్పుతోంది. రెండెకరాల ప్రభుత్వ స్థలంలో సెక్టర్ 8లోని కొండ పక్కగా దీన్ని ఏర్పాటు చేశారు. ఆహ్లాదకర వాతావరణాన్ని తొలుత ప్రోదిచేసినా, అయిదేళ్లుగా పర్యవేక్షణ కరువైంది. దీంతో సందర్శకులకు ఇందులో సేదతీరే ఆస్కారం లేకుండా పోతుంది.

పరిరక్షణ ఊసు లేదు

మురళీనగర్ హరిత పార్కులో నడకమార్గం, పిల్లల ఆట వస్తువులు, షటిల్ కోర్టు, క్రికెట్ నేర్చుకునేందుకు బాలబాలికలకు అకాడెమీ ఏర్పాటైంది. విలువైన ఆస్తుల్ని కాపాడాల్సిన నిర్వహణ కమిటీ సభ్యుల ఉదాసీనత పార్కు అభివృద్ధికి గొడ్డలి పెట్టుగా మారింది. ఈ పార్కు ఇపుడు ప్రేమ జంటల స్థావరంగా పేరుపడింది. ఉదయం 5 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 9 వరకు పార్కులు తెరిచి ఉండడం సహజం. కానీ ఇక్కడి పార్కు ద్వారం ఎల్లవేళలా తెరిచే ఉంటుంది. దీంతో కొందరు వేళ కాని వేళల్లో ప్రవేశించి నానా హైరానా చేస్తున్నారు. పట్టపగలే జంటలుగా వచ్చి అభ్యంతరకరంగా కనిపిస్తున్నా, ఇక్కడి వాచ్‌మన్ కుటుంబం నిరోధించడం లేదు. ఈ తంతుపై దగ్గరలో ఉన్న అపార్టుమెంట్ నివాసితులు ఫిర్యాదు చేస్తున్నారు. గంజాయి, లిక్కర్ బ్యాచ్‌కు ఈ పార్కు రాజమార్గంగా మారింది.



మురళీనగర్‌లోని హరిత పార్కు



చిరుజల్లుకే చిత్తడిలా మారుతున్న షటిల్ కోర్టు

నిరంతర వెలుగులు.. కుక్కల సంచారం

మురళీనగర్ ప్రాంతంలో కొన్ని పార్కులు చక్కగా వెలుగొందుతుంటే, హరిత పార్కు ప్రభ మసకబారుతోంది. పార్కులో హైమాస్ట్ దీపాలు కొన్ని నెలలుగా రేయింబవళ్లు వెలుగులు చిమ్ముతున్నా పట్టించుకోవడం లేదు. పార్కులో కళావేదిక ఫ్యాన్లు తిరగవు. రోజంతా కుక్కలు తిష్ట వేసి, పార్కులోపల స్వైర విహారం చేస్తూ పాదచారులను ఇబ్బంది పెడుతున్నాయి. కమిటీల పేరిట ఏళ్ల తరబడి తిష్ట వేసిన కొందరు రాజకీయ నేతలే పార్కులో హవా నడిపిస్తున్నారు. గత వైసీపీ పాలనలో ప్రజా ప్రతినిధి వెంట తిరిగిన అనుచరగణానిదే ఈ పార్కు అన్న చందంగా తయారైంది. సాయంత్రం కాగానే వారి రాజకీయ కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారు. ప్రతి రెండేళ్లకోసారి మారాల్సిన కమిటీలో 2019 నుంచి ఒక్కరే అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఆర్నెల్ల క్రితం కట్టిన రోడ్డు వైపు స్థలంలోని దుకాణాల కేటాయింపు సైతం వారికి నచ్చిన వారికే ఇచ్చుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొద్ది నెలల క్రితం ఆరంభమైన క్రికెట్ అకాడెమీకి వీరు సహకరిస్తున్న తీరుపై క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పక్కనే ఉన్న ఓ ప్రైవేటు విద్యాసంస్థ విద్యార్థులు ఉదయం వేళ ఆట మైదానంగా మార్చుకున్నారు. పార్కులో ఎక్కడా తాగునీటి వసతి లేదు. నిర్దేశిత పార్కింగ్ సదుపాయం లేదు. కాలనీల్లో ఇళ్ల ముందే పార్కుకు వచ్చే వారి వాహనాలు నిలిపేయడంతో వారితో వాదనలకు దిగడం ఇక్కడ పరిపాటిగా మారింది. జీవీఎంసీ అధికారులు, ఇతర బాధ్యులు ఇప్పటికైనా స్పందించి దీన్ని చక్కదిద్దాలని మురళీనగర్ వాసులు కోరుకుంటున్నారు.

ఆసుపత్రుల అభివృద్ధిపై ఎమ్మెల్యేల చర్చ



విష్ణుకుమార్‌రాజుతో సంభాషిస్తున్న వెలగపూడి రామకృష్ణబాబు

సీతమ్మధార, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా విశాఖలో ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేసే విషయమై ఇద్దరూ చర్చించారు.

నిరుపేదలకు భోజనం ప్యాకెట్ల పంపిణీ

అక్కయ్యపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శంకువానిపాలెంలోని వాగ్దేవి పాఠశాల ఆవరణలో ఆదివారం నిరుపేదలకు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ 13 ఏళ్ల నుంచి క్రమం తప్పక నిర్విరామంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీవీ సత్యనారాయణ, జి.బ్రహ్మానందకుమార్‌ల ఆర్థికసాయంతో అన్నార్తులకు నారాయణ సేవ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ద్వారకానగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీజీ లక్ష్మీనారాయణ, కార్యదర్శి ప్రసాదరావు, బి.హనుమంతరావు, డైరెక్టర్ ఎ.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు త్వరలో పరిష్కారం: ఎమ్మెల్యే వంశీకృష్ణ

జ్ఞానాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురానికి ఎన్నో ఏళ్లుగా ఉన్న ఎర్రగెడ్డ ముంపు సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతానని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రజలకు హామీ ఇచ్చారు. జీవీఎంసీ 41వ వార్డు పరిధిలోని జ్ఞానాపురం, జెఎన్‌ఎన్‌ఎంయూఆర్‌ఎం, బాబు, సెబాస్టియన్ కాలనీల్లో జోన్-5 అధికారులతో కలిసి ఆయన ఆదివారం పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న యూజీడీ పనులు, నిర్మాణంలో ఉన్న కళ్యాణమండపం, నిలిచిపోయిన మరియదాసు కళ్యాణమండపాలను పరిశీలించారు. సెబాస్టియన్ కాలనీలో రోడ్లు తవ్వి వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. వెంటనే ఆయన అధికారులతో మాట్లాడుతూ ప్రజలు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించాలని, సకాలంలో రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. జోనల్ కమిషనర్ బి.రాము, వైద్యాధికారి సునీల్ కుమార్, ఈఈ ప్రసన్నరెడ్డి, ఏపీడీ పద్మావతి, నాయకులు బత్తి మధుబాబు, సంజీవరావు, కర్రి బానోజీరావు, ఆంథోని, శేఖర్, ఆర్.ఐ కె.శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.



ఎర్రగెడ్డను అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మెప్మా అర్బన్ బజారు ప్రారంభం

అల్లిపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పిస్తూ, ప్రోత్సాహం అందించేందుకు మెప్మా ఏర్పాటు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జోన్-4 కార్యాలయంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ బజారును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. ఈ ప్రదర్శన ప్రతీ నెల ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. యూసీడీ పీడీ ఫణిరాం, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఏపీడీ పద్మావతి పాల్గొన్నారు.

రొమ్ములో గడ్డలకు తక్షణ చికిత్స అవసరం



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డాక్టర్ శివానంద తదితరులు

జగదాంబ కూడలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రొమ్ము క్యాన్సర్ పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద పేర్కొన్నారు. ఆదివారం గ్రేటర్ 30వవార్డు శాలిపేట కమ్యూనిటీ హాలులో చైతన్య స్రవంతి సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలిదశలో రొమ్ము క్యాన్సర్ గుర్తించి వైద్య చికిత్సలు అందిస్తే ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చన్నారు. పేద, మధ్య తరగతి మహిళలకు కేజీహెచ్ లో అధునాతన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కీమోథెరపీ, బ్రాకీ థెరపీ సేవలు పూర్తి స్థాయిలో పొందవచ్చని వెల్లడించారు. చైతన్య స్రవంతి సేవా సంస్థ సేవలను ఆయన ప్రశంసించారు. చైతన్య స్రవంతి చైర్‌పర్సన్ డాక్టర్ శిరీన్ రహమాన్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా వివిధ వ్యాధులపై ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. రొమ్ములో గడ్డలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే మెమొగ్రామ్ పరీక్ష చేయించుకోవాలన్నారు. క్యాన్సర్ విభాగం అధిపతి డాక్టర్ పాండురంగ కుమారి మాట్లాడుతూ తొలి రెండుదశల్లో గుర్తించి వైద్య చికిత్సలు అందిస్తే రొమ్ము క్యాన్సర్ పూర్తిగా నయం కావచ్చునన్నారు. ఈ విషయమై ముద్రించిన బ్రోచర్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద , ఇతర ప్రముఖులు, మహిళలు విడుదల చేశారు.

వసూల్ ఖాకీలు

... 7వ పేజీ తరువాయి

సిబ్బంది మాత్రం ఇరువర్గాల నుంచి దండుకుంటున్నారు. ట్రాఫిక్ విభాగంలో డ్రంకెన్‌డ్రైవ్ పేరుతో దాదాపు అన్నిస్టేషన్ల పరిధిలోనూ పెద్దఎత్తున అవినీతి జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తనిఖీలు జరుగుతున్నపుడు మద్యం సేవించిన వాహన చోదకులు కేసులేకుండా వదిలిపెట్టాలని ప్రాథేయపడుతుంటారు. కేసు నమోదైతే కోర్టుకు వెళ్లి జరిమానా చెల్లించాల్సి ఉంటుందని కొందరు, పరువు పోతుందని మరికొందరు ఎంతో కొంత ఇచ్చి జారుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఇదేఅదనుగా సిబ్బంది భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇటీవల ఇద్దరు ట్రాఫిక్ ఎస్ఐలు, ఇద్దరు హోంగార్డులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల సందర్భంగా ఓ ఆటోడ్రైవర్‌ను బ్రోకర్‌గా నియమించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఫిర్యాదులు అందడంతో సీపీ వారిని సస్పెండ్ చేశారు. ఈ ఉదంతం నగర పోలీస్‌శాఖలో జరుగుతున్న వసూళ్ల పర్వానికి అద్దం పట్టింది. నేర పరిశోధన విభాగంలో కూడా గుట్టుచప్పుడు కాకుండా స్క్రాప్ దుకాణాలు, హోటళ్లు, లాడ్జిల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నట్టు పోలీస్‌శాఖలో ప్రచారం జరుగుతోంది. రాత్రివేళ రోడ్డుపక్కన దుకాణాలు పెట్టుకుని వ్యాపారాలు సాగించేవారి నుంచి నైట్‌రౌండ్స్ తిరిగే సిబ్బంది వసూళ్లను ప్రారంభించినట్టు వ్యాపారులు వాపోతున్నారు.

నిద్రపోతున్న స్పెషల్ బ్రాంచి

సాధారణంగా ప్రతి పోలీస్‌స్టేషన్‌లో జరిగే కార్యకలాపాలపై నిఘా పెట్టేందుకు స్పెషల్ బ్రాంచి విభాగం నుంచి ఒక ఏఎస్ఐ/హెడ్‌కానిస్టేబుల్ ఉంటారు. వీరు ఉదయం నుంచి రాత్రి వరకూ సీఐతోపాటు ఎస్ఐలు, సిబ్బంది ఎలా పనిచేస్తున్నారు, స్టేషన్‌కు వచ్చేవారితో ఎలా ప్రవర్తిస్తున్నారు, అవినీతికి సంబంధించి వ్యవహారాలపై నిఘా పెడతారు. స్టేషన్ పరిధిలోని దుకాణాలు, వ్యాపారులు, వాహనచోదకులు, లాడ్జిలు, హోటళ్ల వద్ద పోలీసులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారా? స్టేషన్‌లోని అధికారులు, సిబ్బంది పనితీరుపట్ల ప్రజల అభిప్రాయం ఆరా తీయాలి. ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల ద్వారా సీపీకి చేరవేయాలి. ఈ సమాచారం ఆధారంగా నగరంలో ఏం జరుగుతోందో సీపీకి అవగాహన ఏర్పడుతుంది. స్పెషల్‌బ్రాంచి సిబ్బంది ప్రజల్లో తిరగడం, పోలీస్‌స్టేషన్ కార్యక్రమాలపై నిఘా ఉంచడం మానేసి, స్టేషన్ పరిధిలో జరిగే ప్రెస్‌మీట్‌లు, ఆందోళనలకు హాజరై ఉన్నతాధికారులకు నివేదిక పంపించేసి చేతులు దులిపేసుకుంటున్నారు. దీనివల్ల పోలీస్‌శాఖ పనితీరు మరింత తీసికట్టుగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తెలుగుసినిమా పాటల ప్రాణదాత 'సాలూరి'



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

మహారాణిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమా పాటలకు ప్రాణం పోసిన మహనీయుడు డాక్టర్ సాలూరి రాజేశ్వరరావు అని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు శ్లాఘించారు. ప్రముఖ సంగీత కళాకారిణి డాక్టర్ సుహాసిని ఆనంద్ రచించిన కళాప్రపూర్ణ డాక్టర్ సాలూరి రాజేశ్వరావు సినీ సంగీత సౌరభం పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జిల్లా పరిషత్ జంక్షన్ అంకోశా సమావేశమందిరంలో విశాఖ రసజ్ఞ వేదిక అంకోశా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సినిమాకు సంగీత సౌరభాలు అద్ది మనోరంజకంగా తీర్చిదిద్దారని జీఎస్ఎన్ రాజు కొనియాడారు. డాక్టర్ రఘురామారావు మాట్లాడుతూ తెలుగు చలనచిత్రాలకు సంగీత స్వరాలను శాసించిన సంగీత సామ్రాట్ సాలూరి అని అన్నారు. సంగీతంపై పరిశోధన చేసిన సుహాసిని ఆనంద్ మాట్లాడుతూ సంగీత ప్రియులకు సాలూరి ఆదర్శ ప్రాయులన్నారు. ఈ సమావేశంలో పాలగుమ్మి రాజగోపాల్, కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ ఎస్‌కేఈ అప్పారావు, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ బాలోత్సవాన్ని నవంబరు 19 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు కార్యదర్శి జీవీఎస్ రాజేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఇందుకు సంబంధించిన గోడప్రతిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖరరావు, ప్రొఫెసర్ పద్మ హాజరయ్యారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోపాలరావు, మురళీధర్, పరశురామ్, శేషగిరిరావు పాల్గొన్నారు.

మనిషి జీవన గమనానికి మంచి నీరే ఆయుధం..

డాబాగార్డెన్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవన గమనానికి మంచి నీరే ఆయుధమని పలువురు నిపుణులు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం సిరిపురంలోని ఓ హోటల్‌లో హైడ్రోజన్ వాటర్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పిశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ హైడ్రోజన్ వాటర్‌పై నిపుణులతో పాటు అనేక పరిశోధనలు చేసిన వైద్యులు, అనుభజ్ఞులచే యువత, వినియోగదారులకు అవగాహన కలిగించామన్నారు. మంచినీట్లో పీహెచ్ శాతాన్ని వారంతా వివరించారు. మనిషి జీవన గమనానికి, ఆరోగ్య పరిశుభ్రతకు శుద్ధి చేసిన నీరు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంఎల్ కంట్రీ హెడ్ రవికాంత్, శ్రీనివాస్, డాక్టర్ అప్పారావు, డాక్టర్ జయకుమార్, రొటేరియన్ థాడోడ్, భిమిల్ తదితరులు పాల్గొన్నారు.

'నివాసాల నడుమ మద్యం దుకాణం తగదు'



నిరసన తెలుపుతున్న స్థానికులు

మహారాణిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నివాస స్థలాల నడుమ మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ స్థానిక మహిళలు పందిమెట్ట జంక్షన్ వద్ద ఆదివారం వంటావార్పు నిర్వహించారు. అక్కడే భోజనాలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ప్రభుత్వానికి లేదా, నూతన మద్యం విధానానికి తాము వ్యతిరేకులం కాదని, నివాసాల మధ్య దుకాణం నిర్వహించాలనుకోవడంపైనే తమ అభ్యంతరమని పేర్కొన్నారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటైతే అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని, అందువల్ల ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని కోరారు. పలువురు మహిళలు పాల్గొన్నారు.

యూజర్-చార్జీల్లో చేతివాటం!

... 7వ పేజీ తరువాయి

ఇలా నవంబరు, డిసెంబరు నెలల్లో సుమారు రూ.ఐదు కోట్ల వరకూ వసూలైనట్టు అధికారులు అంచనావేస్తున్నారు. అయితే జీవీఎంసీ ఖాతాకు మాత్రం కేవలం రూ.రెండు కోట్లు మాత్రమే జమవగా, మిగిలిన మొత్తాన్ని కొంతమంది కార్యదర్శులు తమవద్దనే ఉంచారని అనుమానిస్తున్నారు. ఇటీవల పెందుర్తి(జోన్-8)లో ఎంతవరకు యూజర్ చార్జీలు జీవీఎంసీకి జమచేశారనేదానిపై కార్యదర్శుల చేతిలోని యాప్‌లను పరిశీలించగా సుమారు రూ.25 లక్షలు యాప్‌లోనే ఉన్నట్టు గుర్తించడం పరిస్థితికి అద్దంపడుతోంది.

ఇంకా అనధికార వసూళ్లు : అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యూజర్ చార్జీలను రద్దుచేసింది. అయితే వార్డుసచివాలయాల్లో పనిచేస్తున్న కొంతమంది కార్యదర్శులు, ప్రజారోగ్యం విభాగం సిబ్బంది ఇప్పటికీ హోటళ్లు, లాడ్జిలు, పార్లర్‌ల నుంచి అనధికారికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యాపారులు కూడా చెత్తను తరలించేందుకు వీలుగా జీవీఎంసీ సిబ్బందికి డబ్బు ఇచ్చేందుకు వెనుకాడడం లేదని అధికారులు అభిప్రాయపడుతున్నారు. నివాసాలకు యూజర్ చార్జీలు రద్దుచేయడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని, వ్యాపారసంస్థల నుంచి వసూలును కొనసాగించి ఉంటే జీవీఎంసీకి ఆర్థిక భారం తగ్గేదని భావిస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు ఆలోచించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నారు.

గ్రామీణ క్రికెటర్ల ప్రోత్సాహానికి ప్రత్యేక ప్రణాళిక

- ఏసీఏ కార్యవర్గ సన్మాన కార్యక్రమంలో కేశినేని శివనాథ్

విశాఖపట్నం (స్పోర్ట్స్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా ఎన్నికైన ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) కార్యవర్గాన్ని విశాఖ జిల్లా క్రికెట్ సంఘం (వీడీసీఏ) ఆదివారం సన్మానించింది. ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రికెట్‌ను అభివృద్ధి చేసి ప్రతిభ గల క్రికెటర్లను ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళతామని పేర్కొన్నారు. బీసీసీఐ సహకారంతో రాష్ట్రంలో మరిన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించడమే కాకుండా ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఆధునిక వసతులు కల్పిస్తామన్నారు. ఆటగాళ్లకు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రంలో నార్త్, సౌత్, సెంట్రల్ జోన్‌లలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలను ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు చేస్తున్నామని పేర్కొన్నారు. అన్ని జిల్లాల క్రికెట్ సంఘాలతో సమన్వయం పాటించి సలహాలు, సూచనల మేరకు క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యం జాగ్రత్త



శిబిరానికి వచ్చిన వారిని పరీక్షిస్తున్న వైద్యులు

మురళీనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి); మారిన ఆహారపు అలవాట్లు, జీవన విధానం, వెలుగు చూస్తున్న కొత్త కారణాల వల్ల ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని అపోలో హాస్పిటల్స్ గుండె వ్యాధుల నిపుణుడు టి.రవికాంత్ సూచించారు. ఒత్తిడిని నియంత్రించుకుంటూనే, అధిక బరువు ప్రమాదాన్ని ఆదిలోనే గుర్తించాలన్నారు. ఆదివారం మురళీనగర్ వాకర్స్‌క్లబ్ పార్కులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పలువురిని పరీక్షించారు. గుండె వ్యాధుల బారిన పడకుండా మనం తీసుకునే ఆహారంలో కొవ్వు పదార్థాలు, నూనెల వాడకాన్ని తగ్గించాలన్నారు. నిత్య వ్యాయామం ప్రతి ఒక్కరికీ శ్రీరామ రక్షగా పనిచేస్తుందని తెలిపిన డాక్టర్ రవికాంత్ మద్యం, సిగరెట్ అలవాట్లను మానుకోవాలని సూచించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పల్లా చంద్రమౌళి పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో క్లబ్ సభ్యులు నిర్వహణ ఏర్పాట్లు చేపట్టారు. మధుమేహ వైద్య నిపుణులు దీరజ్ ఈ వ్యాధి నియంత్రకు పాటించాల్సిన వైద్య సలహాలు అందించారు. వైద్య సిబ్బంది ఈసీజీ పరీక్షలు సహా దంత వైద్య చికిత్సలు అందించారు. 184 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమ నిర్వహణలో క్లబ్ కోశాధికారి జె.కూర్మారావు, పూర్వ అధ్యక్షులు బుచ్చయ్య చౌదరి, కార్యవర్గ సభ్యులు సహకరించారు.

మందకొడిగా...

... 7వ పేజీ తరువాయి

కళాశాల నుంచి హెచ్‌ఎం/ప్రిన్సిపాల్ కవరింగ్ లెటర్‌తో తహసీల్దార్లకు అప్పగించాలి. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే టీచర్లు/లెక్చరర్ల దరఖాస్తులను డీఈవో ధ్రువీకరించాలి. చివరి నిమిషంలో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వస్తే తహసీల్దార్లు ఉక్కిరిబిక్కిరవుతారని, ధ్రువీకరించడానికి డీఈవోలకు సమయం సరిపోదని భావిస్తున్నారు. ఇదిలావుండగా ఓటరు నమోదుపై ఆరు జిల్లాల డీఈవోలు, ఆర్ఐవోలు, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి పలుమార్లు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

అక్రమ తవ్వకాలపై విజిలెన్స్



గ్రావెల్‌తో నింపిన గుర్రంపాలెం లేఅవుట్

... 7వ పేజీ తరువాయి

తవ్వకాలు చేపట్టారు. ఈ ప్రాంతంలో ఏ మేరకు గ్రావెల్ తవ్వారు? అనేది నిర్ధారించాలంటే గూగుల్‌మ్యాప్‌ల ఆధారంగా సర్వే చేయాలని గనుల శాఖ అధికారులు నిర్ణయించారు. ఏపీఐఐసీ అధికారులు రికార్డులు అందజేసిన తరువాత సర్వే చేయాలా? రికార్డులు ఇవ్వడంలో జాప్యం చేస్తే ఏ విధంగా ముందుకెళ్లాలి అనేదానిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వైర్లు



పిచ్చుక గూళ్లను తలపించేలా..



భవనాలకు సమీపంలో ఉన్న వైర్లు

అస్తవ్యస్తంగా విద్యుత్ వైర్లు

తరచూ షార్ట్ సర్క్యూట్ సమస్యలు తలెత్తుతున్నాయని వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీవాసుల ఆవేదన

ఈపీడీసీఎల్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు

కూర్మన్నపాలెం, అక్టోబరు 27: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీలో విద్యుత్ స్తంభాల నుంచి ఇళ్లకు ఉన్న సర్వీస్ వైర్లు అస్తవ్యస్తంగా ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మరోపక్క విద్యుత్ వైర్లు ఇళ్లకు ఆనుకుని వేలాడుతుండడంతో ఎవరికైనా ప్రమాదం వాటిల్లితే ఎవరు బాధ్యత వహిస్తారని వాపోతున్నారు. హై ఓల్టేజీ, లో ఓల్టేజీ సమస్యలు తలెత్తినప్పుడు అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వైర్ల మూలంగా తరచూ షార్ట్ సర్క్యూట్‌లు సంభవించి ఇళ్లల్లో ఉన్న టీవీలు, ఫ్రిడ్జ్‌లతో పాటు వివిధ రకాల ఎలక్ట్రానిక్ పరికరాలు దెబ్బతింటున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చుక గూళ్లను తలపిస్తున్న విద్యుత్ వైర్ల మూలంగా ఎప్పుడు ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని భయంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

అందువల్ల విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఇక్కడి వైర్లను సరిచేసి తమకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడవలసిందిగా ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నల్లూరు సూర్యనారాయణ, తదితరులు

'నల్లూరు' ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు

కూర్మన్నపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 86వ వార్డు మాతృశ్రీ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు కోసం ఆలోచించే గొప్ప నాయకులు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ అని అన్నారు. దేశంలో జాతీయ పార్టీలకు టీడీపీ రోల్ మోడల్‌గా ఉంటుందన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదుతో ఆ కుటుంబానికి భరోసా, భద్రత, ప్రమాద భీమా రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు పెంచడం జరిగిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతిఒక్కరూ విధిగా టీడీపీ సభ్యత్వాన్ని తీసుకోవాలని నల్లూరు సూర్యనారాయణ కోరారు. కార్యక్రమంలో వార్డు కార్యదర్శి వేగుంట శ్రీనివాస్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదగంట్యాడ టీడీపీ కార్యాలయంలో..

పెదగంట్యాడ: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలందరూ విధిగా సభ్యత్వ నమోదు తీసుకోవాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకట రమణారెడ్డి అన్నారు. పెదగంట్యాడలోని పార్టీ మండల కార్యాలయంలో సభ్యత్వ నమోదును ప్రారంభించి ఆయన మాట్లాడారు. మండలంలో అత్యధిక సభ్యత్వం టీడీపీకి ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ 75వ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, నాయకులు పెద్దాడ సోమునాయుడు, శ్రీముసిరి శ్రీనివాసరావు, దొమ్మేటి అప్పారావు, ఎం.పెంటయ్య, యు.వెంకటరావు, ఎస్.అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం: ఎమ్మెల్యే పంచకర్ల



క్రీడాకారులతో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు

వేపగుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చిన్నతరం నుంచి క్రీడల్లో ప్రోత్సహించడం ద్వారా శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడుతుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. వరలక్ష్మీనగర్‌లోని కాపు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన గంటా కనకారావు మెమోరియల్ ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ కరాటే పోటీలు ఆత్మవిశ్వాసం పెంపునకు దోహదపడతాయన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకరులు ఆయా విభాగాల్లో పోటీల్లో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పంచకర్లను కలిసిన సింహాచలం దేవస్థానం ఈవో

సింహాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును సింహాచల దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు ఐవీ రమణాచార్యులు ఎమ్మెల్యేకు వేదాశీర్వచనాలను అందజేయగా, ఈవో దుశ్శాలువాతో సత్కరించి సింహాద్రి అప్పన్న స్వామి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో ఆనందకుమార్, వాటర్ వర్క్స్ డీఈఈ డీవీఎస్ రామరాజు (హరి) పాల్గొన్నారు.

పేదలకు స్వచ్ఛంద సంస్థలు సేవలందించాలి

కూర్మన్నపాలెం,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పేదలకు సేవ చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మానవతా చారిటబుల్ ట్రస్టు గాజువాక శాఖ చైర్మన్ దేనంకొండ కృష్ణంరాజు అన్నారు. 87వ వార్డు కణితిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి మండప ప్రాంగణంలో ఆదివారం జరిగిన మానవతా ట్రస్టు ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 13 జిల్లాల్లోని 103 మండలాల్లో 52,400 మంది సభ్యులతో ఈ ట్రస్టు విస్తరించి సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతుందన్నారు. వడ్లపూడి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కారుమూరి మహేశ్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను మరింతగా విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఎం.శ్రీనివాసరావు, ఎంఎస్ఎన్ మూర్తి, వీర్కే రాజు, సుందరమూర్తి, కేవీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేడు నడక పోటీలు

వేపగుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 98వ వార్డు పాత గోశాల కూడలిలో సోమవారం ఉదయం ఏడు గంటలకు శ్రీవరహాలక్ష్మీనరసింహ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పురుషుల, మహిళల నడక పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, పి.గణబాబు ప్రారంభిస్తారన్నారు. వయస్సుల వారీగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

గోతులమయమైన రహదారులకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పకీరుతఖ్యా వద్ద గోతులను పూడుస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం, అక్టోబరు 27: జీవీఎంసీ 88వ వార్డు పరిధి గ్రీన్ సిటీ నుంచి టీడీఎల్‌కు వెళ్లే రహదారులు పూర్తిగా గోతులమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నట్టు ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'దారులు దారుణం' శీర్షికతో ప్రచురితమైన కథనాకానికి అధికారులు స్పందించారు. ఈ ప్యాచ్ వర్క్ పనులు చేపట్టి గోతులను పూడ్చారు. దీంతో కొంత మేర రోడ్డు తగ్గే అవకాశముందని పలువురు పేర్కొంటుటున్నారు.

కరాసలో గోతులు పూడ్చివేత

ఎన్.ఎ.డి.జంక్షన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు పరిధి పాత కరాస నుంచి న్యూ కరాసకు వెళ్లే మార్గంలో గోతుల మూలంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులకు ఎట్టకేలకు మోక్షం లభిస్తుంది. ఇక్కడి రహదారిలో యుజీడీ కనెక్షన్ ఏర్పాటు కోసం కొన్ని రోజుల కిందట రోడ్డును తవ్వారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఎట్టకేలకు రెండు రోజుల నుంచి గోతుల పూడ్చివేత పనులను చేపడుతున్నారు.

శ్రమదానం చేసిన కూటమి నాయకులు

అగనంపూడి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి జాబిలి హిల్స్, అన్నపూర్ణ గృహ సముదాయాల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం పలువురు నాయకులు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ముళ్ల పొదలు, చెత్తాచెదారాన్ని తొలగించి వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో నాయకులు గొల్లవిల్లి వెంకటరావు, మురళి, ధర్మారావు, నరేంద్ర, ఎల్వీ రావు, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

దీపావళి దుకాణాల పేరుతో దందా!

గాజువాక ఆదర్శ మైదానంలో 50 స్టాళ్ల ఏర్పాటుకు అనుమతి

ఒక్కో దుకాణదారుని నుంచి రూ.55-60 వేలు వసూలు?



ఆదర్శ మైదానంలో బాణసంచా అమ్మకాలకు సిద్ధమవుతున్న స్టాళ్లు

గాజువాక, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దీపావళి దుకాణాల పేరుతో దందా జరుగుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గాజువాకలోని ఆదర్శ మైదానంలో 50 స్టాళ్ల ఏర్పాటుకు వ్యాపారులు సిద్ధమయ్యారు. సోమవారం నుంచి వీరు అమ్మకాలు ప్రారంభించనున్నారు. అయితే స్టాళ్ల ఏర్పాటు కోసం వ్యాపారులు భారీ మొత్తంలో నగదును మధ్యవర్తులకు ముట్టజెబుతున్నట్టు తెలిసింది. ఆదర్శ మైదానంలో 50 స్టాళ్ల ఏర్పాటుకు అనుమతి లభించడంతో ఒక్కో వ్యాపారి నుంచి మధ్యవర్తులు రూ.55 వేల నుంచి రూ.60 వేల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఒక్కో వ్యాపారి నుంచి వసూలు చేసిన మొత్తంలో రూ.20 వేలను స్థానిక రాజకీయ నాయకులకు చెల్లించనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

అలాగే బాణసంచా అమ్మకాల నిమిత్తం వివిధ శాఖల నుంచి అనుమతులు తీసుకునేందుకు, ఏ శాఖ నుంచి కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు గాను పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దందాలో ఇద్దరు వ్యక్తులు కీలకంగా వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. ఇలా అక్రమ వసూళ్లకు పాల్పడుతుండడంతో వ్యాపారులు ఆ భారాన్ని కొనుగోలుదారులపై వేస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా అధికారికంగా 50 స్టాళ్లకు అనుమతి ఉంటే అనధికారికంగా మరో 20 వరకు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



త్రిశూలం ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న చింతలపూడి వెంకట్రామయ్య, తదితరులు

20 అడుగుల త్రిశూలం ప్రతిష్ఠ

కూర్మన్నపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి కుంచుమాంబ ఆలయంలో ఆదివారం 20 అడుగుల త్రిశూల ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, డి.దానప్పలు, బి.గోవిందరాజు, జి.వెంకటరావు, గ్రామ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ముస్లింలతో కలిసి ప్రార్థన చేస్తున్న పల్లా శ్రీనివాసరావు

ఎల్‌వీ నగర్ మసీదులో చందనోత్సవం

ఆటోనగర్, అక్టోబరు 27: జీవీఎంసీ 70వ వార్డు పరిధి ఎల్‌వీ నగర్‌లో గల మసీదులలో ఆదివారం నూర్ ఈ ఇస్లాం మజ్జీద్ ఆధ్వర్యంలో జరిగిన గ్యార్వీ షరీఫ్ చందనోత్సవంలో మత పెద్దలు పాల్గొని, ఖురాన్‌ను పఠించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హజ్రత్ గౌస్ పాక్ నిషానీ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నూతన వస్త్రాలు సమర్పించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ మైనారిటీల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు నాయకులు చట్టి గోపి, కేవీఎస్ శంకరరావు, రెహమాన్, వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షుడు రజాక్, మసీదు కమిటీ సభ్యులు షిలార్ బాబా, మహ్మద్, అబ్దుల్ రహీమ్, అయూబ్, ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

పగిలిన పైపు లైన్‌ను పరిశీలించిన 'పల్లా'

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస ప్రధాన రహదారిలో పగిలిన అండర్‌గ్రౌండ్ పైపు లైన్‌ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పరిశీలించారు. ఓ టెలికామ్ సంస్థ చేపడుతున్న డ్రిల్లింగ్ పనుల కారణంగా అండర్‌గ్రౌండ్ పైపు లైన్ భారీగా దెబ్బతినడంతో నీరు పెద్దఎత్తున పారడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు పల్లా దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఇక్కడకు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని సూచించడంతో వారు నీటి సరఫరాను నిలిపివేసి పనులు ప్రారంభించారు. పల్లా వెంట నాయకులు బి.సత్యనారాయణ, మజ్జి శ్రీను, బి.చందూరమేశ్, కె.శ్రీను, ఎస్.సింహాచలం, లోవరాజు, అచ్యుత్, బలిరెడ్డి శ్రీను, తదితరులు ఉన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న నడుపూరు హై స్కూల్ ఉపాధ్యాయులు

చెకుముకి పోటీల్లో రాణించిన విద్యార్థులు

పెదగంట్యాడ, అక్టోబరు 27: జన విజ్ఞాన వేదిక ఆదివారం నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకున్నారు. దీంతో ఈ విద్యార్థులు వచ్చే నెల 14, 15 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో జరగనున్న చెకుముకి సైన్స్ క్విజ్ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎన్.గీతిక, నైన్త్ విద్యార్థి కె.వర్షిణి, పదో తరగతి చదువుతున్న దిలీప్‌కుమార్ సాహు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు పరశురామ్ పాలూరి, నడుపూరు హైస్కూల్ హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

పేద కుటుంబాలకు చేయూత

అగనంపూడి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి ఉక్కు నిర్వాసిత కాలనీల్లో ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పలు నిరుపేద కుటుంబాలకు స్థానిక సర్వహిత చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు చేయూతనందించారు. ఈ మేరకు పలు కుటుంబాలను ఆదివారం వారు కలిసి నిత్యావసర సరకులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు గుదే సుశీల గజేంద్రరావు, పట్టా రామ అప్పారావు, మస్తాన్‌రెడ్డి, లోవరాజు, హనుమంతురావు, లక్కరాజు రాము, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎక్స్‌కవేటర్‌తో రహదారిని చదును చేస్తున్న దృశ్యం

ఆలయాలకు రోడ్డు మార్గం ఏర్పాటు

అగనంపూడి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి కొండపై వెలసిన పిల్లేలమ్మ, పోలిపిల్లిమ్మ అమ్మవార్ల ఆలయాలకు రహదారి మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల ఈ మార్గం మొత్తం ముళ్లపొదలతో నిండిపోయింది. దీంతో అమ్మవార్ల ఆలయాలకు వెళ్లేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో స్థానికులు ఈ సమస్యను కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి రహదారి నిర్మాణ పనులకు చర్యలు చేపట్టారు. జీవీఎంసీకి చెందిన ఎక్స్‌కవేటర్‌తో ఆ మార్గంలో పేరుకుపోయిన ముళ్లపొదలను తొలగించడంతో పాటు గోతులను పూడ్చివేయించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సింగిడి సింహాచలం, పి.సూర్య, ఎం.సత్తిబాబు, జి.శ్రీను, కాసులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాద వితరణ



గురుస్వామి అదపాక వెంకటరమణ

ఆటోనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీస్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో నవంబరు రెండు నుంచి డిసెంబర్ 27వ తేదీ వరకు షీలానగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో నిత్యాన్నదానం చేస్తామని గురుస్వామి అదపాక వెంకటరమణ తెలిపారు. 70వ వార్డు శ్రీనివాస నగర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 24 ఏళ్లుగా నిర్విరామంగా ఆలయంలో అన్నప్రసాద వితరణను చేపడుతున్నామన్నారు. అయ్యప్ప స్వామి భక్తులు, భవానీమాలధారులు, శివమాల భక్తులందరూ అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. ఆర్థిక సహాయం చేయాలనుకునే భక్తులు ఆలయ కమిటీని సంప్రదించాలన్నారు.

హెల్మెట్ ధారణపై ఉక్కు గేటు వద్ద ప్రచారం

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్షణ ఉంటుందని స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగాధిపతి ఎంఎస్ఎన్ రాజు అన్నారు. హెల్మెట్ ధారణపై ప్లాంట్ సెంట్రల్ భద్రతా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గేటు వద్ద ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే వారందరూ తప్పనిసరిగా హెల్మెట్, కారు నడిపేటప్పుడు సీటు బెల్ట్‌ను ధరించాలని కోరారు. ఉక్కు కర్మాగార ప్రవేశం వద్ద హెల్మెట్ తప్పనిసరి చేయటం వల్ల ప్రమాదాలు తగ్గాయని, దురదృష్టవశాత్తు ఎప్పుడైనా ప్రమాదం జరిగినా ప్రాణాపాయం తప్పుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భద్రత కమిటీ సభ్యులు సాంబశివరావు, రాజు, రాము, ఈశ్వరరావు, బాషా, భారతి, తదితరులు పాల్గొన్నారు.

కోలాటం బృందానికి ఆర్థిక సాయం

మల్కాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 61, 62లకు చెందిన కోలాటం బృందానికి టీడీపీ 61వ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేశ్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోలాటం మన సంప్రదాయాల్లో భాగమని, ఇప్పుడిప్పుడే దీనిని అందరూ అన్ని పండగల్లో ఏర్పాటు చేస్తుండడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వం నుంచి కోలాటానికి గుర్తింపునిస్తే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో కోలాటం బృందం ప్రతినిధి సునీత, తదితరులు పాల్గొన్నారు.

3 కోడిపుంజులు, రూ.800 నగదు స్వాధీనం

పెందుర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరిపల్లి సమీపంలో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురుని అదుపులోకి తీసుకున్నట్టు ఆదివారం సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు. వీరి నుంచి మూడు కోడిపుంజులు, రూ.800 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

79వ వార్డులో దోమల నివారణకు ఫాగింగ్

అగనంపూడి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు చర్యలు చేపడుతున్నట్టు మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం, పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు శనివారం రాత్రి ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాలువల్లో చెత్తాచెదారాన్ని వేయరాదన్నారు. అలాగే ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. అనంతరం ఆయన దగ్గరుండి ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో సీజనల్ వర్కర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **వీనమ్ :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **పొట్టేల్ :** వెంకటేశ్వర, సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎంతపనిచేసావ్ చంటి :** వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **లగ్గం :** విశేష్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **దేవర :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **వేట్టయాన్ :** సంగం, గోకుల్, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **విశ్వం :** శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, హెవెన్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 39, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 50, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 46, బీరకాయలు 30, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 50, క్యాబేజ్ 28, క్యారెట్ 54, దొండకాయలు 36, బంగాళదుంపలు 31, అరటికాయ (పెద్దది) 7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 60, బరబాటి 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 40, దోసకాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 48, కీరదోస 30, క్యాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 28, కంద 62, దేముడుచిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, బూడిద గుమ్మడికాయ 30, మామిడికాయలు 100, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	100
ఫారం ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

వినికిడి లోపం... పిల్లలకు శాపం!

విశాఖపట్నం, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): 'బాబుకు ఐదేళ్లు వచ్చేసింది. ఏమీ మాట్లాడడం లేదు. పెద్ద శబ్దాలకు కూడా స్పందించడం లేదు. ఏమైందో అర్థం కావడం లేదు. ఆలస్యంగా మాటలు వస్తాయనుకున్నామే గానీ వినికిడి సమస్య ఉందని గుర్తించలేకపోయాం. ఏమైందో అర్థం కావడం లేదు. బాబు మాట్లాడేలా చేయండి సార్'... ఇదీ నగర పరిధిలోని ఈఎన్‌టీ ఆస్పత్రికి బిడ్డను తీసుకువచ్చిన ఒక తల్లి వైద్యుడితో వ్యక్తం చేసిన ఆవేదన.

- సకాలంలో గుర్తించడంలో విఫలమవుతున్న తల్లిదండ్రులు
- కొన్నాళ్లుగా పెరుగుతున్న కేసులు
- రెండేళ్లలోపు సమస్యను గుర్తిస్తే శస్త్ర చికిత్సతో ఫలితం
- ఉచితంగా రూ.12 లక్షల కాక్లియర్ ఇంప్లాంట్ చికిత్స చేయిస్తున్న ప్రభుత్వం



వినికిడి లోపం అతిపెద్ద సమస్య. చిన్నారుల్లో ఈ సమస్య అధికంగా కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. ఏటా దేశంలో లక్ష మందికి పైగా చిన్నారులు వినికిడి సంబంధిత సమస్యతో పుడుతున్నారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ సమస్య పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం పడుతుంది.వీలైనంత త్వరగా గుర్తించి, సరైన సమయంలో చికిత్స చేయించడం అత్యంత అవసరం. పుట్టుకతో వస్తున్న వినికిడి సమస్యను గుర్తించడంలో ఎంతో మంది తల్లిదండ్రులు విఫలమవుతున్నారు. ఇది ఆయా చిన్నారులు పాలిటశాపంగా మారుతోంది.

వినికిడి, మాటలకు అవినాభావ సంబంధం ఉంది. శబ్దం వినగలిగే సామర్థ్యం ఉన్నప్పుడే దానికి ప్రతి స్పందనగా మాటలు వస్తాయి. కానీ, వినికిడి సామర్థ్యం లేకపోతే ప్రతిస్పందించే గుణంగా తగ్గిపోతుంది. క్రమంగా సదరు చిన్నారి మూగగా మారేందుకు కారణమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

పెరుగుతున్న కేసులు..

గతంతో పోలిస్తే ఈ తరహా కేసులు పెరుగుతున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు. మాట్లాడడం లేదని, వినికిడి సమస్య ఉందంటూ వస్తున్న కేసులు భారీగా ఉంటున్నాయి. నగర పరిధిలోని ఈఎన్‌టీ ఆస్పత్రితో పాటు ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌ల్లో ఉండే ఈఎన్‌టీ వైద్య నిపుణులు వద్దకు ప్రతినెలా కనీసం ఈ తరహా కేసులు 50 వరకు వస్తున్నాయి. వీరిలో కనీసం 30 మందికి స్పీచ్ థెరపీ నిర్వహించడం ద్వారా మాటలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. మరో 20 మంది వరకు వినికిడి సమస్యతో బాధ పడుతున్నట్టు గుర్తిస్తున్నారు. వీరిలో పది మంది చిన్నారులకు కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలు చేయాల్సి వస్తోందని వైద్యులు గుర్తిస్తున్నారు. సాధారణంగా పుట్టుకతోనే వినికిడి సమస్య ఉన్న వారిని రెండేళ్లలోపు గుర్తించి కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స నిర్వహించడం వల్ల మెరుగైన ఫలితం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అయితే, చాలామంది పిల్లల్లో ఉన్న ఈ సమస్యను గుర్తించ లేకపోవడంతో ఐదారేళ్ల తరువాత కూడా వైద్యుల వద్దకు తీసుకువస్తున్నారు. వీరికి శస్త్ర చికిత్సను నిర్వహించవచ్చు. కానీ, కొన్నిసార్లు మెరుగైన ఫలితాలు రాకపోవచ్చని వైద్యులు చెబుతున్నారు. కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స నిర్వహించేందుకు రూ.10 నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చు అవుతుంది. కానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ శస్త్రచికిత్సను ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకంలో ఉచితంగా నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రిలో ప్రతి నెలా ఈ శస్త్రచికిత్సలు నాలుగు వరకు నిర్వహిస్తుండగా, ప్రైవేటు ఆస్పత్రుల్లో మరో ఎనిమిది వరకు చేస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.



స్క్రీనింగ్ పరీక్షతో మేలు..

వినికిడి సమస్యను గుర్తించడంలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వాలు, వైద్య నిపుణులు నవజాత శిశువులు పుట్టిన వెంటనే వారికి వికినిడి పరీక్షను నిర్వహించేలా చేస్తున్నాయి. కేజీహెచ్‌తో పాటు అనేక ప్రైవేటు ఆస్పత్రుల్లో వినికిడి పరీక్షను నిర్వహిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో ఈ అవకాశం లేకపోవడంతో ఇబ్బంది ఎదురవుతోంది. బెరా వంటి పరీక్షను నిర్వహించి వినికిడి సమస్యను నిర్ధారిస్తారు.



స్పీచ్ థెరపీ తప్పనిసరి..

కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స తరువాత చిన్నారికి కనీసం మూడేళ్ల పాటు స్పీచ్ థెరపీ ఇప్పించాల్సి ఉంటుంది. అప్పుడే మిగిలిన చిన్నారుల మాదిరిగా పిల్లలు మాట్లాడేందుకు అవకాశం ఉంటుంది. దీనినే ఆడియో వెర్బల్ థెరపీ అంటారు. ఈ థెరపీని ఇవ్వడం వల్ల జీవితాన్ని సాధారణ పిల్లలు మాదిరిగానే లీడ్ చేసుకునే అవకాశముంది.

ఇవీ కారణాలు..

పిల్లల్లో వినికిడి లోపానికి అనేక కారణాలు దోహదం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. కొందరికి వంశపారంపర్యంగా వస్తుంటే, మరికొందరికి తల్లిదండ్రుల్లో లోపముంటే పిల్లలకు వచ్చే అవకాశం ఉంది. గర్భధారణ సమయంలో తల్లికి రూబెల్లా, సైటోమెగాలే వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లు వచ్చినా పిల్లలు ఈ సమస్య బారిన పడే అవకాశముంది. కొన్నిసార్లు తల్లి వేసుకునే మందులు వికటించడమూ కారణం కావచ్చు. కాన్పు సమయంలో ఎదురు కాళ్లతో జన్మించడం, మెదడుకు తగినంత ఆక్సిజన్ అందకపోవడం వంటి కారణాలు ఈ సమస్యకు దోహదం చేయవచ్చు. పుట్టిన తరువాత చిన్నారులకు వచ్చే మెనింజైటిస్, మీజిల్స్, గవద బిళ్లలు వంటి ఇన్‌ఫెక్షన్లు కూడా కొందరి చిన్నారులకు హాని చేసే ప్రమాదం ఉంది. చెవికి దెబ్బ తగలడం, కొన్నిసార్లు జ్వరం వచ్చిన తరువాత కూడా పిల్లలు వినికిడి కోల్పోయే ప్రమాదం ఉంది.

రెండేళ్లలోపు గుర్తిస్తే ఫలితం



చిన్నారుల్లో వినికిడి సమస్య తీవ్రమైనది. తల్లిదండ్రులు సకాలంలో గుర్తించడం కీలకం. ఐదేళ్లు దాటే వరకు చాలా మంది తల్లిదండ్రులు ఈ సమస్యను గుర్తించలేకపోతున్నారు. ముందుగానే గుర్తిస్తే కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స ద్వారా సాధారణ జీవితాన్ని లీడ్ చేయవచ్చు. ఆలస్యమైతే శస్త్రచికిత్స చేయించే అవకాశాన్ని కోల్పోతారు. కొన్నిసార్లు ఐదేళ్లు దాటిన వారికి చేసినా మెరుగైన ఫలితాలు ఉండవు. మాట్లాడడం లేదని, ఎంత గట్టిగా పిలిచినా స్పందించడం లేదంటూ మూడు, నాలుగేళ్ల తరువాత ఎంతో మంది తల్లిదండ్రులు పిల్లలను తీసుకువస్తున్నారు. వారిని పరీక్షిస్తే పట్టుకతోనే ఈ తరహా సమస్య ఉందని తేలుతోంది. బెరా పరీక్ష ద్వారా సమస్యను వెంటనే గుర్తించవచ్చు. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. లేదంటే పిల్లలు జీవితాంతం నరకయాతన అనుభవించాల్సి ఉంటుంది.

– డాక్టర్ బి.రామచంద్రరావు, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రి వైద్య నిపుణులు

నేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్య అభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీడేటా టెక్నాలజీస్, మాల్బియా డయాగ్నస్టిక్స్, 2నిధి ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీలతో జాబ్‌మేళా నిర్వ హిస్తున్నట్టు వెల్లడించారు. ఎంపికైన వారికి విశాఖపట్నం జిల్లాలో జాబ్ లొకేషన్ ఉంటుందన్నారు. ఆసక్తి గల యువత కళాశాలకు వచ్చి స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94906 32318 నంబర్‌కు సంప్రతించాలని ఆయన సూచించారు.

దివేష్ శర్మకు ఐదు వికెట్లు... ఆంధ్ర 344 ఆలౌట్



విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో హిమాచల్‌ప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో ఆంధ్రా తొలి ఇన్నింగ్స్ 344 పరుగుల వద్ద ముగిసింది. 295/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు బ్యాటింగ్ కొనసాగించిన ఆంధ్ర మరో 49 పరుగులకు చివరి నాలుగు వికెట్లు పడిపోయాయి. హిమాచల్‌ప్రదేశ్ బౌలర్ దివేష్ శర్మ ఐదు వికెట్లు పడగొట్టగా, రిషి ధావన్ మూడు వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన హిమాచల్‌ప్రదేశ్ రెండోరోజు ఆటముగిసే సరికి నాలుగు వికెట్లకు 198 పరుగులు చేసింది. ఓపెనర్లు శుభమ్ అరోరా (16), ప్రశాంత్‌చోప్రా (10) విఫలం కాగా, అంకిత్ (53), ఆకాష్, వశిష్ట్ (52 నాటౌట్) అర్ధ సెంచరీలతో ఆదుకున్నారు. రిషి ధావన్ (38 నాటౌట్) క్రీజులో ఉన్నాడు. ఆంధ్ర బౌలర్లలో కెవి.శశికాంత్ మూడు వికెట్లు పడగొట్టగా, విజయ్ ఒక వికెట్ తీశాడు.

పర్యావరణ సమతుల్యతను పరిరక్షించాలి

- ఏయూ వీసీ ప్రొఫెసర్ శశిభూషణరావు

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి. శశిభూషణరావు పిలుపునిచ్చారు. ఏయూ వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో తూర్పు కనుమల్లోని స్థానిక జాతుల పరిరక్షణ పేరుతో రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న వృక్షజాతులను సంరక్షించడం ఎంతో అవసరమన్నారు. సాంకేతికత ఎంతగానో అభివృద్ధి చెందుతోందని, అదే సమయంలో పర్యావర ణాన్ని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అణుబాంబుల వల్ల కలిగిన నష్టం, పర్యావరణానికి జరిగిన నష్టాన్ని ఆయన వివరించారు. బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా కోల్‌కతాకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ఎస్ దాస్ మాట్లాడుతూ సంగీతానికి కూడా స్పందించే గుణం మొక్కలకు ఉందని ఇటీవల పరిశోధనలు స్పష్టం చేశాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు నిబద్ధతతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతితో కలిసి ప్రయాణం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. శాస్త్ర సంబంధమైన జ్ఞానాన్ని సేకరించడం, సరిచూసుకోవడం, దాన్ని భద్రపర్చడం ఎంతో అవసరమన్నారు. సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్‌బీ పడాల్ మాట్లాడుతూ ఏయూ బొటానికల్ గార్డెన్‌లో 30కిపైగా అరుదైన జాతులను సంరక్షిస్తున్నామన్నారు. తూర్పు కనుమల ప్రత్యేకతలు, సదస్సు విశిష్టతను వివ రించారు. సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు మాట్లాడుతూ మైనింగ్, టూరిజం, అడవులను ఆక్రమించడం వంటి చర్యల వల్ల అటవీ విస్తీర్ణం తగ్గిపోతూ సహజ వృక్షజాతులు దెబ్బతింటున్నాయని తెలిపారు. అటవీ సంరక్షణ ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో సీడీసీ డీన్ టి. వెంకటకృష్ణ, విభాగాధిపతి ప్రొఫెసర్ డి. సంధ్య, ఫ్యాకల్టీ ప్రొఫెసర్ రత్నకుమార్, సుజాత, బలరామస్వామి యాదవ్, ఎన్ఎన్ దొర తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

'కంగువా'.. ప్రేక్షకులను అలరిస్తుంది

- నేచురల్ లైటింగ్‌లో సినిమాను చిత్రీకరించాం
- విభిన్న భాషలకు చెందిన నటీనటులు అంకితభావంతో పని చేశారు
- సినిమా కథానాయకుడు, ప్రముఖ నటుడు సూర్య



విలేకరులతో మాట్లాడుతున్న హీరో సూర్య

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కంగువా చిత్ర బృందం విశాఖలో సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా విశాఖకు వచ్చిన యూనిట్ నోవాటెల్‌లో 'వైజాగ్ కంగువా' పేరుతో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. 'కంగువా' సినిమాను స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్, కేవీఎన్ ప్రొడక్షన్స్, పెన్ స్టూడియోస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మించాయి. ఈ సమావేశంలో పాల్గొన్న చిత్ర కథా నాయకుడు, ప్రముఖ హీరో సూర్య మాట్లాడుతూ టికెట్ కొనుగోలు చేసిన ప్రతి ప్రేక్షకుడిని సినిమా అలరిస్తుం దన్నారు. సినిమా చూసిన ప్రేక్షకులంతా సంతృప్తితో బయటకు వస్తారన్నారు. వచ్చే నెల 14న విడుదల అవుతున్న సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని వీను లు విందైన సంగీతాన్ని అందించారన్నారు. సినిమా కోసం వివిధ భాషలకు చెందిన ఎంతో మంది నటీనటులు అంకితభావంతో పని చేశారన్నారు. సుమారు 700 ఏళ్ల క్రితం జరిగిన కథగా పేర్కొన్న సూర్య.. ఐదు తెగల మధ్య అధికారం కోసం జరిగిన పోరాటమే 'కంగువా' అని వెల్లడించారు. సినిమాను పూర్తిగా నేచురల్ లైటింగ్‌లోనే చిత్రీకరించినట్టు వివరించారు. తెలుగులో శౌర్యం తీసిన దర్శకుడు శివ.. 'కంగువా'ను అద్భుతంగా తెరకెక్కించారన్నారు. హీరో నాగార్జున కూడా సినిమాను మెచ్చుకున్నట్టు వెల్లడించారు. బాబీ డియోల్ విలన్ పాత్రలో ఒదిగిపోయారన్న సూర్య.. చిత్రంలో పనిచేసిన నటులంతా తమ స్థాయిలో అద్భుత ప్రతిభను కనబరిచారన్నారు. తనకు విశాఖ అంటే ఎంతో ఇష్టమన్న సూర్య.. ఇక్కడకు వస్తే ఎంతో ఆనందం కలుగుతుందన్నారు. చిత్ర నిర్మాత కేఈ జ్ఞానవేల్ మాట్లాడుతూ వెయ్యేళ్ల కిందట రెండు తెగల మధ్య జరిగిన పోరాటం నేపథ్యంగా సినిమా సాగుతుందన్నారు. నటుడు అవినాష్ మాట్లాడుతూ సూర్యతో కలిసి నటించే అవకాశం రావడం తన అదృష్టమన్నారు.

జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నీకి విశాఖ క్రీడాకారులు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నీలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆదివారం నగరంలో అభినందన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన అగ్రికల్చరల్ రిటైర్డ్ జాయింట్ డైరక్టర్ కె.కృష్ణమూర్తి, రాష్ట్ర టేబుల్ టెన్నిస్ సంఘం సంయుక్త కార్యదర్శి డీవీఎస్‌వై.శర్మ మాట్లాడుతూ విశాఖ టేబుల్ టెన్నిస్ క్రీడారంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళుతున్న వారందరూ అభినందనీయులని కొనియాడారు. జాతీయ స్థాయి టోర్నీకి ఎంపికైన సంయుక్త, హర్షిక్, మహాధర్, రేణుక, లలిత్, జశ్మిత, ఆరిఫా సుల్తాన్, చరణ్, మణికుమార్, దీక్షితలకు ట్రాక్ షూట్స్ అందజేసి, జాతీయ టోర్నీలోనూ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



మృతురాలు జ్యోతి

పెందుర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం సింహగిరినగర్‌లో చోటు చేసుకుంది. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాకకు చెందిన కుదిరి సాయికుమార్, జ్యోతికి ఆరేళ్ల క్రితం వివాహమవ్వగా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెందుర్తి మహిళా ప్రగతి కేంద్రం సమీపంలోని సింహగిరినగర్‌లో ఉంటున్న తన తండ్రి మల్లేశ్వరరావుకు కంటి శస్త్ర చికిత్స జరగడంతో ఈనెల 1న జ్యోతి ఇక్కడకు వచ్చింది. అప్పటి నుంచి ఆమె ముభావంగానే ఉండేది. అత్తింటి వేధింపులు ఏమైనా ఉన్నాయా అని తల్లిదండ్రులు అడిగితే కడుపులో నొప్పి అని, మందులు వాడుతున్నానని చెప్పేది. ఆదివారం తల్లిదండ్రులు పనిమీద బయటకు వెళ్లడంతో ఇంట్లోని ఇనుప రాడ్డుకు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా ఇద్దరు ఆడపిల్లలు పుట్టారన్న కారణంతో అత్తింటి నుంచి ఆమెకు ఇబ్బందులు ఎదురయ్యాయని స్థానికులు అంటుండగా, తమ అల్లుడు, కుమారై అన్యోన్యంగానే ఉండేవారని.. కడుపునొప్పి తాళలేక జ్యోతి ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సీఐ సతీశ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

ఎండాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొమ్మాది సేవానగర్‌లో నివాసం ఉంటున్న మద్దోల్ ఢిల్లీరావు నగరంలోని లా కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఆయన భార్య దినసరి కూలీ. వారికి ఇద్దరు కుమారులు, కుమార్తె. చిన్న కుమారుడు గోపాల్ (22) చంద్రపాలెంలో ఉన్న బజాజ్ షోరూమ్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. రెండు నెలల క్రితం అతనికి ఒడిశాలోని కొమ్మూరికి చెందిన చంద్రమ్మ అనే యువతితో నిశ్చితార్థం అయ్యింది. పెళ్లి నిశ్చయం కావడంతో ఇప్పుడున్న ఇల్లు సరిపోదని గోపాల్ అదే ప్రాంతంలో ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్నారు. అయితే వారం రోజుల క్రితం పెళ్లి కుదిరిన యువతి తల్లి వివాహ ప్రతిపాదనను విరమించుకుంటున్నట్టు గోపాల్ తండ్రికి ఫోన్ చేసి చెప్పింది. దీంతో గోపాల్ మనస్తాపానికి గురయ్యాడు. శనివారం రాత్రి ఫ్లాట్‌లో డోర్ లాక్ చేసుకుని పడుకున్నాడు. ఆదివారం ఉదయం ఎంత కొట్టినా తలుపులు తీయకపోవడంతో తండ్రికి అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సింహగిరిపై భారీ వర్షం



ఆలయంలో కురుస్తున్న వర్షం

సింహాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం 11 గంటల వరకు ఎండ ఉండగా తరువాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చిమ్మచీకట్లు కమ్మేసాయి. తరువాత కొద్ది నిమిషాలకే భారీ వర్షం ప్రారంభమై దాదాపు అర్ధగంట పాటు కురిసింది. దీంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. డ్రైనేజీల నిర్వహణ సక్రమంగా లేక గోదాదేవి అమ్మవారు, లక్ష్మీనారాయణుల సన్నిధుల నడుమ వర్షం నీరు నిలిచిపోయింది. వర్షం కారణంగా మధ్యాహ్నం 11.30 గంటలకు జరగాల్సిన రాజభోగం మహానివేదన సుమారు 40 నిమిషాలు ఆలస్యంగా జరిపారు.

వార్డు సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు

- విధులకు హాజరుకాని వారికి షోకాజ్ నోటీసు
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన అధికారులు

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వార్డు సచివాలయాల పనితీరుతో పాటు సిబ్బంది సమయపాలనపై జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహించారు. సచివాయాల పనివేళల్లో సిబ్బంది లేకపోవడంపై ఈనెల 25న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన వార్డు సచివాలయాల శాఖ జిల్లా ఇన్‌ఛార్జి సీహెచ్ ఉషారాణి శుక్రవారం పలు సచివాలయాలను తనిఖీ చేశారు. జోన్-3 పరిధిలోని పీతలవానిపాలెం సచివాలయం నంబర్ 151ను తనిఖీ చేయగా ఒకరు సెలవులో ఉండగా, మూడు పోస్టులు ఖాళీగా ఉన్నట్టు గుర్తించారు. పిఠాపురం కాలనీలోని 149 సచివాలయంలో రికార్డులు పరిశీలించగా రెండు పోస్టులు ఖాళీగా ఉండగా, ఒకరు పద్మనాభం డెప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. మిగిలిన నలుగురు సెక్రటరీలు సెలవు పెట్టకుండానే విధులకు గైర్హాజరైనట్టు గుర్తించారు. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు నివేదిక అందజేయాలని జోన్-3 కమిషనర్‌ను ఆమె ఆదేశించారు. జోన్-3 కమిషనర్ వారందరికీ షోకాజ్ నోటీసులు జారీచేసి, మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని చెప్పారు. నగరంలోని ఇతర సచివాలయాల్లో కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌ఛార్జి ఉషారాణి తెలిపారు.

రొమ్ము కేన్సర్‌పై అవగాహన అవసరం

రామ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రొమ్ము కేన్సర్ వ్యాధి ఎక్కువ అవుతోందని, దీనిపై అవగాహన పెంచుకోవడం ద్వారా నియంత్రణ సాధ్యమవుతుందని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు పోలీయో డే నేపథ్యంలో ఆదివారం సాగర తీరంలో రోటరీ క్లబ్, క్వాంటమ్ డయాగ్నస్టిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ 50 ఏళ్లు దాటిన ప్రతి మహిళ రొమ్ము కేన్సర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఫుట్‌బాల్‌కు గ్రహణం వీడదా?

- ఆంధ్రా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ

విశాఖపట్నం స్పోర్ట్సు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): క్రీడా సంఘాలకు వైసీపీ ప్రభుత్వం చేసిన ద్రోహంతో రాష్ట్ర, జిల్లా ఫుట్‌బాల్ సంఘాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ విమర్శించారు. ఆదివారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మారినా ఫుట్‌బాల్ రంగానికి పట్టిన గ్రహణం ఇంకా వీడకపోవడం బాధాకరమన్నారు. అధికార బలంతో ఏలూరు వైసీపీ మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ తన అనుచరగణంతో విశాఖకు వచ్చి తప్పుడు రిజిస్ట్రేషన్లతో రాష్ట్ర, జిల్లా ఫుట్‌బాల్ సంఘాలలో చొరబడి ఫుట్‌బాలర్ల భవిష్యత్తును అంధకారం చేశారన్నారు. 2021లో ఇండియన్ లీగ్ (ఐ లీగ్) శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్‌ను విశాఖకు తీసుకువచ్చామని తెలిపారు. విశాఖ ఫుట్‌బాల్ భవిష్యత్తు ఉన్నత స్థాయికి చేరుతుందని ఆశించగా మాజీ ఎంపీ శ్రీధర్ ఫుట్‌బాలర్ల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కార్యకలాపాలు చేపట్టే విధంగా ప్రోత్సహించి, శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్‌లో ఆంధ్రా నుంచి ఒక్క ఫుట్‌బాలర్‌కు కూడా అవకాశమివ్వకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి నవంబరులో ఐ లీగ్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లను విశాఖలో నిర్వహించే విధంగా చొరవ చూపాలని కోరారు. సమావేశంలో వాల్తేరు ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొసరాజు గోపాలకృష్ణ

గోవుల సంరక్షణపై ఇంత నిర్లక్ష్యమా?

- జ్ఞానానంద ఆశ్రమంలో దయనీయ స్థితిలో మూగజీవాలు
- సరైన ఆహారం లేక బక్కచిక్కుతున్న వైనం
- పట్టించుకోని దేవస్థానం, ఆశ్రమ నిర్వాహకులు



బక్కచిక్కి ఉన్న గోవులు

వెంకోజీపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయం వద్ద జ్ఞానానంద ఆశ్రమ గోశాలలోని గోవుల పరిస్థితి దయనీయంగా తయారైంది. సరైన ప్రాంగణం లేక, పట్టించుకునేనాథుడు లేక గోవులు సంరక్షణ అధ్వానంగా ఉంది. సరైన ఆహారం కూడా ఆకలికి అలమటిస్తున్నాయి. అపరిశుభ్రమైన పరిసరాల్లో బక్క చిక్కిన ఆవులను చూస్తుంటే ఎవరికైనా గుండె తరుక్కుపోతుంది. పలువురు దాతలు ఇచ్చిన ఎండు గట్టి కుప్పలు మాత్రం కనిపిస్తున్నాయి. కానీ గోవులను చూస్తే సరైన సంరక్షణ లేదన్న విషయం ఇట్టే తెలిసిపోతుంది. అటు దేవస్థానం వారు గానీ, ఇటు జ్ఞానానంద ఆశ్రమం నిర్వాహకులు గానీ ఆవుల గురించి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షం పడితే చాలు గోవులన్నీ బురదలోనే మగ్గిపోవాల్సిందే. సరైన ఆదరణ లేక ఆవులు చనిపోతున్నాయని, వాటిని ఈ ప్రాంగణంలోనే పూడ్చి వేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆ పూడ్చివేత కూడా సరిగా చేపట్టకపోవడంతో దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ గోశాలలో ఆవుల దుస్థితిని పరిశీలించి, సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.